

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పేదల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేలా సంక్షేమ పాలన సాగిస్తోంది. పేదలు దశాబ్దాలుగా నివాసం ఉంటున్న స్థలాలను క్రమబద్ధీకరించి, స్వయంగా సీఎం చంద్రబాబు చేతుల మీదుగా పట్టాలు అందజేస్తూ నిజమైన 'పేదల పట్టాభిషేకం' చేస్తున్నారు.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**


శుక్రవారం 02.10.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 162 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00




# బీసీలకు అండగా నిలిచింది... నిలిచేది మేమే

- రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో అప్పీలుకు వెళ్తాం
- బీసీల సామాజిక, రాజకీయ, ఆర్థిక సాధికారతే లక్ష్యం
- సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో రాష్ట్రంలో మార్పు

**రేపల్లె, అక్టోబర్ 1 (జర్నలిస్ట్ ఫైల్) :** బీసీలకు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా అండగా నిలిచింది... నిలిచేది తామేనని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. బీసీలకు చేయూతను అందించే విషయంలో ఎక్కడా రాజీ పడబోమని తేల్చి చెప్పారు. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో అప్పీలుకు వెళ్లనున్నట్లు తెలిపారు. బీసీలకు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అండగా నిలవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. బాపట్ల జిల్లా రేపల్లెలో పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ప్రజావేదికలో సీఎం ప్రసంగించారు. నాడు బీసీలకు రాజకీయంగా ఎన్టీఆర్ గుర్తింపు తెచ్చారని.. తాను వారికి అండగా నిలబడి ప్రోత్సహించానని సీఎం అన్నారు. 1995లో స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు తెచ్చామని ముఖ్యమంత్రి వెల్లడించారు. గొడ్డలి పార్టీ అధికారంలోకి వచ్చాక రిజర్వేషన్లను 24 శాతానికి కుదించిందన్నారు. తద్వారా 16,800 మంది పదవీ అవకాశాలు కోల్పోయారని ముఖ్యమంత్రి అన్నారు. దీనిపై సీఎం మాట్లాడుతూ.." ఇప్పుడు మళ్లీ మేం అధికారంలోకి వచ్చాక బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తే గొడ్డలి పార్టీ కోర్టుకు వెళ్లింది. హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసింది. 50 శాతం కంటే రిజర్వేషన్లు పెరగకూడదని కోర్టులో వాదించారు. కోర్టు ఆ జీవోలను కొట్టేసింది. దీనిపై రేపే ఈ సుప్రీం కోర్టులో అప్పీలుకు వెళ్తున్నాం. వెనుకబడిన వర్గాలను ఆర్థికంగా, సామాజికంగా రాజకీయంగా పైకి తీసుకురావటమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది. ఒక్క టీచర్ ఉద్యోగం కూడా ఇవ్వని వ్యక్తులు.. మేం మెగా డీఎస్సీ తో ఉద్యోగాలు ఇస్తే ఆరోపణలు చేస్తున్నారు. 350 కేసులు కోర్టుల్లో వేసి నియామక ప్రక్రియను అడ్డుకునే ప్రయత్నం చేశారు. వెనుకబడిన వర్గాలపై ద్వేషంతో కోర్టులకు వెళ్లి అడ్డంకులు సృష్టించే రిజర్వేషన్లు రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఏది ఏమైనా బీసీలను రాజకీయంగా అండగా నిలబడే బాధ్యతను మేం తీసుకుంటాం.

మిగతా 2లో...



## డ్వాక్రా రుణంతో వ్యాపారం... వాట్సాప్‌తో విస్తరణ

- రూ.2 లక్షల రుణంతో కిరాణా దుకాణం విస్తరణ
- స్మార్ట్‌ఫోన్‌తో ఆర్డర్లు.. ఇళ్లకే సరుకుల పంపిణీ
- 'వన్ ఫ్యామిలీ-వన్ ఎంట్రప్రెన్యూర్'తో జేజమ్మకు స్ఫూర్తి
- స్వయం ఉపాధితో మహిళలు ఆర్థికంగా ఎదగాలని సీఎం సూచన

2 లో

## నెల రోజుల్లో డీఎస్సీ 2.0



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** నెల రోజుల్లో డీఎస్సీ 2.0 నోటిఫికేషన్ విడుదల చేయడానికి ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో విద్యాశాఖ ఉన్నతాధికారుల తో మంత్రి లోకేష్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... నోటిఫికేషన్ విడుదల నుంచి అభ్యర్థులకు పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చే వరకు ప్రతి దశలోనూ పూర్తి పారదర్శకంగా ప్రక్రియ చేపట్టాలని అన్నారు. దేశం మొత్తం ఆంధ్రప్రదేశ్ రిక్రూట్ మెంట్ మోడల్‌ను ఆసక్తిగా గమనిస్తోంది, మనం అనుసరిస్తున్న విధానాలనే

- నోటిఫికేషన్ విడుదలకు ఏర్పాట్లు చేయండి
- పోస్టింగ్ వరకు ప్రతి దశలో పూర్తి పారదర్శకత
- డ్రాప్‌అవుట్ల నివారణకు 'జీరో డ్రాప్‌అవుట్ మిషన్'
- విద్యాశాఖ అధికారులతో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేష్ సమీక్ష

2 లో

## నైపుణ్యంతో.. యువతకు ఉపాధి

- ఇప్పటివరకు 5.43 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- సీడాప్ ద్వారా ఏడాదికి లక్ష మందికి ఉద్యోగాలే లక్ష్యం
- పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్‌ను సమర్థంగా వినియోగించండి

2 లో



నైపుణ్యాభివృద్ధి విభాగంపై సమీక్షలో మంత్రి లోకేష్

## బుర్రిపాలెం సీఎం సభను విజయవంతం చేయాలి

- టీడీపీ శ్రేణులకు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పిలుపు

**తెనాలి, అక్టోబరు 1 (జర్నలిస్ట్ ఫైల్) :** బుర్రిపాలెంలో అక్టోబరు 4న జరగనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సభను ఘనంగా విజయవంతం చేయడానికి తెలుగుదేశం పార్టీ శ్రేణులు, కూటమి పార్టీల శ్రేణులు కదలిరావాలని మాజీ మంత్రి, తెనాలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. సభను విజయవంతం చేసే దిశగా ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

తెనాలిలోని ఎన్వీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో టీడీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. బుర్రిపాలెంలో జరిగే సీఎం పర్యటన, సభ ఏర్పాట్లు, పార్టీ శ్రేణుల సమీకరణ, గ్రామస్థాయి కార్యాచరణ తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. బుర్రిపాలెం పర్యటనలో సీఎం గృహ నిర్మాణ కార్యక్రమానికి శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం కూడా ఏర్పాట్లను వేగవంతం చేసింది.



2లో

## ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహం

- సీఐఐ సదస్సుకు ముందు ఐదు ప్రాంతీయ సదస్సులు
- ఐదు నగరాల్లో అక్టోబరు 7 నుంచి 26 వరకు నిర్వహణ
- యువత, మహిళలు, విద్యార్థులకు పారిశ్రామిక అవకాశాలపై అవగాహన

3 లో



## కోనసీమ రైలుకు కదలిక

- కొటిపల్లి-నరసాపూర్ లైన్‌కు అదనంగా రూ.100 కోట్లు
- రాష్ట్ర వాటా నిధులు తక్షణమే విడుదల
- ఇప్పటికే చేసిన భూసేకరణ వ్యయానికీ వాటాలో లెక్క
- పనులు నిరంతరాయంగా సాగేందుకు చర్యలు



3 లో

## ఆక్వా కాలుష్యంపై.. కొరడా!

- పర్యావరణానికి హాని చేసే చర్యలు ఆమోదయోగ్యం కాదు
- కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి
- ప్రతి 15 రోజులకు ఆక్వా యూనిట్లలో ప్రమాణాల పరీక్ష
- నీటి వనరుల పరిరక్షణకు కఠిన చర్యలు: పవన్ కల్యాణ్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడం, సహజ జలవనరుల పరిరక్షణ... ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యతనీ, నీటి వనరులను కలుషితం చేసే హక్కు ఎవరికీ లేదని రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి, అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. పరిశ్రమలు పర్యావరణ పరిరక్షణపట్ల అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని చెప్పారు. ఏ పరిశ్రమ అయినా పర్యావరణానికి, సమాజానికి హాని కలిగించే విధంగా యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘించడం ఆమోదయోగ్యం కాదన్నారు. కాలుష్యాన్ని మూలం వద్దే నివారించడం అత్యంత కీలకమైన అంశమని పేర్కొన్నారు. ఆక్వా వ్యర్థాల కారణంగా సహజ నీటి వనరులు, భూగర్భజలాలు కాలుష్య బారినపడకుండా జాగ్రత్తలు పాటించాలని, ప్రతి పరిశ్రమ నిర్దేశిత ప్రమాణాలు తప్పక పాటించి తీరాలని ఆదేశించారు. గురువారం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో ఆక్వా ప్రాసెసింగ్, ప్రీ-ప్రాసెసింగ్ యూనిట్లు పాటించాల్సిన పర్యావరణ అనుసరణలపై సీ ఫుడ్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ ప్రాంత ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

మిగతా 2లో...

## డైట్ చార్జీల పెంపు



- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- అక్టోబర్ 1 నుంచే ఛార్జీల పెంపు
- నూతన మెనూ అమలు చేస్తూ ఉత్తర్వులు
- ఆరు రోజులు గుడ్లు, మూడ్రోజులు చికెన్
- పౌష్టికాహారంతో బీసీ విద్యార్థులకు ఆరోగ్యం : మంత్రి సవిత
- డైట్ ఛార్జీల పెంచినందుకు మంత్రి సవిత హర్షం
- సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు

3 లో

## పరిశుభ్రతకు..'స్వచ్ఛ' పురస్కారం

- 12 ప్రభుత్వ ఆసుపత్రులకు రాష్ట్రస్థాయి అవార్డులు
- మరుగుదొడ్లు, చేతుల పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యం
- ఇన్‌ఫెక్షన్ నియంత్రణపై క్షేత్రస్థాయి పరిశీలన
- అధికారులను అభినందించిన మంత్రి సత్యకుమార్ యాదవ్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని 12 ప్రభుత్వ ఆసుపత్రులకు 'స్వచ్ఛ ఆంధ్ర రాష్ట్రస్థాయి అవార్డులు-2026' లభించాయి. స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రుల్లో పరిశుభ్రతకు సంబంధించిన అంశాలపై నిర్వహించిన పరిశీలనలో వీటిని ఎంపిక చేశారు. జిల్లాల నుంచి వచ్చిన స్వీయ ప్రతిపాదనల (సెల్ఫ్ అసెస్ మెంట్) ఆధారంగా స్వచ్ఛ ఆంధ్ర అధికారులు తృతీయ పక్షం ద్వారా ఆయా ఆసుపత్రులను క్షేత్రస్థాయిలో నేరుగా పరిశీలన చేయించారు.

చివరికి 12 ఆసుపత్రుల్ని అవార్డులకు ఎంపిక చేశారు. వీటికి సంబంధించిన అధికారులకు శుక్రవారంనాడు అవార్డులను సీఎం చంద్రబాబు అందజేయనున్నారు

**5 కేటగిరీల్లో పరిశీలన :** ఆసుపత్రులకు స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు అందించేందుకు 5 అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. మహిళలు, పురుషులకు వేర్వేరుగా ఉపయోగపడే మరుగుదొడ్ల నిర్వహణకు 30 శాతం,

2లో

# ద్వాక్రా రుణంతో వ్యాపారం... వాట్సాప్‌తో విస్తరణ



**రేపల్లె, అక్టోబర్ 1(జర్నలిస్ట్ ఫైల్) :** స్వయం సహాయక సంఘాల ద్వారా అందుతోన్న రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. ద్వాక్రా రుణాలు, ప్రభుత్వ ప్రోత్సాహంతో చిన్న వ్యాపారాలను ప్రారంభించి వాటిని క్రమంగా విస్తరించుకోవచ్చని సూచించారు. బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గంలో పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. రేపల్లెలోని 4వ వార్డులో శ్రీలక్ష్మి కిరాణా జనరల్ స్టోర్‌ను సందర్శించి దుకాణా యజమాని జి.జేజమ్మతో పాటు స్వయం సహాయక సంఘాల మహిళలతో సీఎం ముఖాముఖి మాట్లాడారు.

**రూ.2 లక్షల రుణంతో విస్తరించిన వ్యాపారం :** డ్వాక్రా రుణంతో కిరాణా దుకాణాన్ని ఏర్పాటు చేసుకుని నిర్వహిస్తున్నామని జి.శ్రీనివాసరావు, జి.జేజమ్మ దంపతులు ముఖ్యమంత్రికి వివరించారు. 2003 నుంచి పెయింటర్‌గా పనిచేస్తున్నారని శ్రీనివాసరావు వివరించారు. 2025 ఫిబ్రవరిలో రూ.1 లక్ష పెట్టుబడితో చిన్న దుకాణాన్ని ఏర్పాటు చేసుకున్నామని, అదే ఏడాది జూన్‌లో రూ.2 లక్షల గ్రూప్ లింకేజీ రుణం లభించడంతో వ్యాపారాన్ని కొంత విస్తరించినట్లు వారు తెలిపారు. సాంకేతికతను సైతం వినియోగించుకుంటూ తమ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నట్లు జెజమ్మ, శ్రీనివాసరావు తెలిపారు. స్మార్ట్‌ఫోన్లు, వాట్సాప్ ద్వారా వినియోగదారుల నుంచి ఆర్డర్లు తీసుకుంటూ నెలవారీ కిరాణా సరుకుల అవసరాలను వినియోగదారులు వాట్సాప్‌లో పంపుతుండగా, ఆర్డర్ చేసిన సరుకులను తన భర్త వారి ఇళ్లకు వెళ్లి అందజేస్తున్నట్లు జేజమ్మ తెలిపారు. ప్రభుత్వం తీసుకొచ్చిన 'వన్ ఫ్యామిలీ--వన్ ఎంట్రప్రెన్యూర్ కార్యక్రమం తనకు ఎలా స్ఫూర్తిని ఇచ్చిందో జేజమ్మ సీఎంతో పంచుకున్నారు.

**వ్యాపార నిర్వహణపై మహిళలకు సీఎం దిశానిర్దేశం :** తమ వ్యాపార ఆలోచనలు, అనుభవాలు, భవిష్యత్ ప్రణాళికలను ద్వాక్రా మహిళలు సీఎంకు వివరించారు. వివిధ రంగాల్లో ఉన్న వ్యాపార అవకాశాలను మహిళలు అన్వేషించి స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగాలని సీఎం చంద్రబాబు వారికి సూచించారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు వాట్సాప్ బిజినెస్‌పై ఉన్న అవగాహనను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీనివాసరావు తండ్రి వెంకటరావుకు సీఎం చంద్రబాబు వృద్ధాప్య పింఛన్‌ను అందజేశారు. అనంతరం స్వయం సహాయక సంఘాల మహిళలతో కలిసి సీఎం ఫొటో దిగారు.

# నెల రోజుల్లో డీఎస్సీ 2.0



(మొదటి పేజీ తరువాయి)

ఇతర రాష్ట్రాలు అనుసరించే అవకాశం ఉందని తెలిపారు. రాష్ట్రంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా 'మిషన్ మార్చ్' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని అన్నారు.

బడి మానేసే (స్కూల్ డ్రాపౌట్) పిల్లలు భవిష్యత్తులో మాదకద్రవ్యాల (డ్రగ్స్) బారిన పడటం, అనేక సామాజిక సమస్యలకు దారితీస్తున్నట్లు ఇటీవల తిరుపతి వచ్చిన సింగపూర్ హోం మంత్రి షణ్ముగం చెప్పారని, ఈ అంశాన్ని అధికారులంతా గమనంలోకి తీసుకోవాలన్నారు. డ్రాప్ అవుట్స్ నివారణలో కమ్యూనిటీ లీడర్లను భాగస్వాములను చేసి 'జీరో డ్రాప్ అవుట్ మిషన్' చేపట్టాలని సూచించారు. యువత పెడదారి పట్టకుండా ఇప్పటికే 'డ్రగ్స్ వద్దు బ్రో' వంటి ప్రచార కార్యక్రమాలను పెద్దఎత్తున అమలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దిన నిడమర్రు స్కూల్ సందర్శనకు త్వరలో సింగపూర్ మంత్రి షణ్ముగంను ఆహ్వానిస్తామని చెప్పారు. రాష్ట్రంలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 స్కూళ్లను గుర్తించి, 'లీప్ స్కూల్స్'గా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు పంపాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. విద్యాశాఖలో రాష్ట్రపతి ఉత్తర్వులు - 2025 అమలు విధివిధానాలపై సమీక్షించారు.

రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల పరిధిలో 1,523 అధ్యాపక పోస్టుల భర్తీకి పకడ్బందీ చర్యలు చేపట్టాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. ఉన్నత విద్య డైరెక్టర్ నారాయణ భరత్ గుప్తా స్పందిస్తూ... అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ప్రక్రియ పూర్తయింది, డిసెంబర్‌లో రాత పరీక్ష నిర్వహణకు ఏపీపీఎస్సీ ఏర్పాట్లుచేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో క్యాంపస్‌ల ఏర్పాటుకు జేఎస్ఎస్ యూనివర్సిటీ, థాపర్ యూనివర్సిటీ, యూపీఈఎస్, జేయూఎస్ యూనివర్సిటీ, బెన్నెట్ యూనివర్సిటీ, సవిత యూనివర్సిటీ వంటివి ఆసక్తి చూపుతున్నాయని అధికారులు తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ విద్యాసంస్థల క్యాంపస్‌ల ఏర్పాటుకు అవసరమైన భూమిని గుర్తించాలని, త్వరితగతిన నిర్మాణాలు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు.

రాష్ట్రంలో ాూాూ (ాబజుాజుాశీతీఅఅస్త్రాూఅఅస్త్రతీథు'ం ాముథుతీఅఅఅస్త్ర ుతీథుఅంటశీతీఎఫ్అశీఅ) ప్రోగ్రామ్ అమలుపై మంత్రి లోకేష్ సమీక్షిస్తూ.. కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. డిసెంబర్ నాటికి తొలివిడత పూర్తవుతున్న నేపథ్యంలో... మలివిడత కోసం సంప్రదించాలని మంత్రి సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 125 ప్రాంతాల్లో ఆటిజం సెంటర్ల ఏర్పాటుకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనిపై సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి. శ్రీనివాసరావు స్పందిస్తూ తొలివిడతగా 21 ఆటిజం సెంటర్ల ఏర్పాటుకు అవసరమైన కౌన్సిలర్లను గుర్తించామని చెప్పారు. ఆటిజం, భవిత సెంటర్లు సాధ్యమైనంత వరకు ఒకేచోట ఉండేలా సూచించారు. ఈ నెలాఖరుకు 14 సెంటర్ల సివిల్ కన్‌స్ట్రక్షన్స్ పూర్తి చేస్తామని చెప్పారు. ఏయూ శతాబ్ది ఉత్సవాలు పూర్తిచేసుకున్న నేపథ్యంలో విశాఖలో పబ్లిక్ లైబ్రరీ శాఖ భాగస్వామ్యంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించబోతున్న గ్రంథాలయ నమూనాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మానవ వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి జే. శ్యామలరావు, ఉన్నత విద్య డైరెక్టర్ నారాయణ భరత్ గుప్తా, ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ రంజిత్ బాషా, పాఠశాల విద్య డైరెక్టర్ తమీమ్ అన్సారియా, సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి. శ్రీనివాసరావు, ఉన్నత విద్యామండలి ఇంఛార్జ్ చైర్మన్ విజయభాస్కర్, రాష్ట్ర విద్య, మౌలిక సదుపాయాల సంస్థ ఎండీ దీవెన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు అండగా నిలిచింది... నిలిచేది మేమే

(మొదటి పేజీ తరువాయి)

ఈ ప్రాంతంలో బీసీ బిడ్డ అనగాని భగవంతరావు చక్కగా పనిచేశారు. ఇప్పుడు మంత్రిగా అనగాని సత్యప్రసాద్ ప్రజల కోసం పనిచేస్తున్నారు. బీసీలుగా నాయకులు రాజకీయంగా ఎదిగే అవకాశాలు కల్పించేది కూటమి ప్రభుత్వమే." అని ముఖ్యమంత్రి అన్నారు.



**జీవన ప్రమాణాలు పెంచటమే లక్ష్యం :** "గడచిన 28 నెలలుగా ప్రతీ నెలా మొదటి తేదీన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కార్యక్రమంలో పాల్గొంటున్నాను. చీఫ్ మినిస్టర్ అంటే కామన్ మ్యాన్ అని నేను విశ్వసిస్తున్నాను. ప్రజల కష్టాలు, సమస్యలు తెలుసుకుంటూ పనిచేస్తున్నాను. పేదలకు న్యాయం చేయాలన్న బాధ్యతతో మేం పనిచేస్తున్నాం. ప్రతినెలా నాలుగు మార్లు ప్రజల ముందుకు వస్తున్నాం. ప్రతీ నెలా 1 తేదీన పేదలకు ఆర్థిక భద్రత కల్పించే పెన్షన్ల కార్యక్రమం, 9 తేదీన మీ భూమి - మీహక్కు కార్యక్రమంలో పాల్గొంటున్నాం. గత పాలకులు సృష్టించిన భూ వివాదాలను పరిష్కరిస్తూ ముందుకు వెళ్తున్నాం. ఇక ప్రతిమూడో శనివారం పర్యావరణాన్ని కాపాడే స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి , 4వ శనివారం సంజీవని కార్యక్రమానికి హాజరవుతున్నాను. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని బాధ్యతగా తీసుకుని నిత్యం ప్రజా సేవకులుగా పనిచేస్తున్నాం. గడచిన రెండేళ్లుగా ప్రతీ వ్యక్తికి, ప్రతీ కుటుంబానికి సాధికారిత తీసుకువస్తున్నాం. రాష్ట్రంలో ఆ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. గొడ్డలి పార్టీ నేతలు ప్రజలు కొట్టిన దెబ్బకు అలిగి అసెంబ్లీకి కూడా రాకుండా ముఖం చాటేస్తున్నారు. గత పాలకులు అన్ని వ్యవస్థల్నీ భ్రష్టు పట్టించారు. రాష్ట్రాన్ని విధ్వంసం సృష్టించారు. కష్టంతో సంకల్పంతో ఒక్కోమెట్టూ ఎక్కుతూ ఒక్కో ఇటుకా పేరుస్తూ రాష్ట్ర పునర్నిర్మాణం చేస్న?న్నాం. ఆర్థిక సవాళ్లు అధిగమించి సంక్షేమం అందిస్తున్నాం. పెన్షన్లకే ఇప్పటికి రూ.76 వేల కోట్లు ఖర్చు చేశాం. వెంటిలేటర్ పై ఉన్న ఆర్థిక వ్యవస్థను కేంద్ర సహకారంతో ఆక్సిజన్ ఇచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తున్నాం. కేంద్రంలో, రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారు, బుల్లెట్ స్పీడ్ తో సుపరిపాలన అందిస్తున్నాం. పేదరికాన్ని ఆర్థిక కోణంలో కాదు మానవీయ కోణంలో ఆలోచించి జీవన ప్రమాణాలు పెంచడానికి చూస్తున్నాం. సంక్షేమంతో పాటు పీ4 కార్యక్రమం ద్వారా అట్టడుగున 20 స్థాయి మందికి చేయూత అందించేలా చర్యలు చేపట్టాం. బంగారు కుటుంబాలను ఎంపిక చేసి వారి జీవన ప్రమాణాలు పెంచేలా చర్యలు తీసుకున్నాం." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**సంపద సృష్టికి మూలధన వ్యయం పెంచాం :** "రాష్ట్రవ్యాప్తంగా విశాఖ, విజయవాడ, మంగళగిరి తదితర ప్రాంతాల్లో నివాసస్థలాల్లో పేదలకు పట్టాలు ఇచ్చాం. రూ.52 వేల కోట్ల విలువైన నివాస స్థలాలకు పట్టాలు ఇచ్చి వారి సమస్యలు పరిష్కరించాం. పేదల కుటుంబాలకు చేయుతను ఇచ్చే అంశాన్ని ఆర్థిక కోణంలో చూడటం లేదు. పేద కుటుంబాల్లో 3-4 పథకాల ద్వారా ఆర్థిక సహకారం చేయూత అందుతోంది. స్త్రీశక్తి, తల్లికి వందనం, దీపం, మత్స్యకార సేవలో, ఆటోడ్రైవర్ల సేవలో ఇలా వేర్వేరు పథకాలు అందుతున్నాయి. రాష్ట్రంలో ప్రతీ వర్గాన్ని ఆదుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రాష్ట్రంలో 1 లక్ష మంది ద్వాక్రా మహిళలను వ్యాపారవేత్తలుగా మార్చాం. మరో 5 లక్షల మందిని కూడా వ్యాపారవేత్తలుగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రతీ నెలా డబ్బులు ఇచ్చేసి వెళ్లడానికి రాలేదు. ప్రజలను కలిసి వారి బాగోగులు తెలుసుకోడానికి వస్తున్నాను. అట్టడుగుస్థాయి వ్యక్తికి ఆర్థిక స్థోమత ఇచ్చి జీవన ప్రమాణాలు పెంచినప్పుడే అభివృద్ధి అదే నా సిద్ధాంతం. సంక్షేమాన్ని, అభివృద్ధిని సమానంగా చేపడుతున్నాం. పట్టణ ప్రాంతాల్లో రూ.50 వేల కోట్లు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.11వేల కోట్ల పనులు చేపడుతున్నాం. గత పాలనలో రోడ్లన్నీ గోతులు తవ్వేశారు. గడచిన రెండేళ్లుగా వాటిని పూడ్చి రోడ్లు బాగు చేశాం. సంజీవని కార్యక్రమం ద్వారా ప్రతీ పౌరుడి ఆరోగ్య రికార్డులను డిజిటల్ గా పర్యవేక్షిస్తాం. ఏపీ బ్రాండ్ ను పునరుద్ధరించటం ద్వారా పారిశ్రామిక వేత్తలు రాష్ట్రానికి క్యూ కడుతున్నారు. రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులు, 20 లక్షల మందికి ఉద్యోగాలు గడచిన రెండేళ్లలో వచ్చాయి. సంపద సృష్టించేలా క్యాపిటల్ ఎక్స్ పెండిచర్ పెంచాం. రోడ్లు, రైల్వే, పోర్టులు, ఎయిర్ పోర్టులు పూర్తి చేస్తున్నాం. రాయలసీమ జీవనాడి హంద్రీనీవా మొదటి దశ పనులు పూర్తి అయ్యాయి. వంద రోజుల్లో రూ.3,500 కోట్లు ఖర్చు చేసి చిట్టచివరి ప్రాంతమైన కుప్పం వరకూ నీళ్లు తీసుకెళ్లాం. వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ పూర్తి చేసి మార్కాపురం వరకూ నీళ్లు తీసుకువచ్చాం. శ్రీశైలం మల్లన్న పాదాల నుంచి మార్కాపురం చెన్నకేశవ స్వామి చెంతకు కృష్ణమ్మ నీళ్లు తీసుకెళ్లాం. పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి వరకూ గోదావరి నీళ్లు తీసుకువెళ్లాం. ఎల్ నినో కారణంగా వర్షాలు పడక రాష్ట్రంలో కరవు వచ్చింది. డ్రామాలు ఆడటానికి గొడ్డలి పార్టీ బయల్దేరింది. వరుణ దేవుడి కృపవల్ల మనకు సరైన సమయంలో కాస్త వర్షాలు పడ్డాయి. కృష్ణానదిలో నీళ్లు రాకపోయినా గోదావరి నీళ్లు పట్టిసీమ ద్వారా డెల్టాకు తెచ్చాం. గతంలో కేవలం 13 నెలల్లోనే పట్టిసీమ పూర్తి చేసి కృష్ణా డెల్టాకు నీళ్లు తెచ్చాం. పోలవరం పూర్తి అయితే కృష్ణా, గోదావరి డెల్టాలకూ నీటి సమస్యే ఉండదు. పట్టిసీమ అనే నిర్ణయం ఇక్కడి రైతుల జీవితాల్లో వెలుగులు తీసుకువచ్చింది. గొడ్డలి పార్టీ విమర్శలకు భయపడితే కృష్ణాడెల్టాకు నీళ్లు వచ్చేవి కావు. ప్రతిపక్ష పార్టీ అంటే పోటీ తత్వం ఉండాలి. కాని గొడ్డలి పార్టీకి కుట్రతత్వం ఉంది. అభివృద్ధికి ఆటంకాలు కలిగించటమే గొడ్డలి పార్టీ పని" అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

**పర్యాటక ల్యాండ్ మార్క్‌గా సూర్యలంక:** "వచ్చే మూడేళ్లలో రూ.35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులు పూర్తి చేస్తాం. అభివృద్ధితో పాటు పర్యావరణాన్ని కూడా మనం కాపాడుకోవాల్సి ఉంది. అన్నిప్రాంతాల్లోనూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలి. రాయలసీమ ప్రాంతాన్ని గ్లోబల్ హార్టీ కల్చర్ హబ్ గా మారుస్తున్నాం. రూ.1 లక్ష కోట్లతో ప్రకాశం జిల్లాతో కలిపి 10 జిల్లాలను గ్లోబల్ హార్టీ కల్చర్ హబ్ గా అభివృద్ధి చేస్తాం. ఉద్యాన పంటలతో పాటు లాజిస్టిక్స్ , పర్యాటకం ఇలా అన్ని రంగాల్లో పెట్టుబడులు వస్తాయి. బాపట్లలోని సూర్యలంక బీచ్ దీనిని గోవా తరహాలో అభివృద్ధి చేస్తాం. పర్యాటకుల్ని ఆకర్షించేలా దీనిని తీర్చిదిద్దాలని ప్రణాళికలు చేస్తున్నాం. ఆ పర్యాటకుల్ని ఆకర్షించటం ద్వారా సూర్యలంక దేశ చిత్రపటంలో ఓ ల్యాండ్ మార్క్ గా మారాలి. వాన్ పిక్ ప్రాంతాన్ని గొడ్డలి పార్టీ అధినేత సర్వనాశనం చేశారు. అభివృద్ధే రాకుండా పోయింది. ఇష్టానుసారం అవినీతి చేసి సీబీఐ, ఈడీ కేసుల్లో ఇరుక్కున్నాడు. వాన్ పిక్ ద్వారా అద్భుతమైన పారిశ్రామిక టౌన్ షిప్ తయారు కావాల్సిన ప్రాంతాన్ని నాశనం చేశారు. ప్రజలకు జవాబుదారీ పరిపాలన ఇవ్వాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యం. ప్రభుత్వ ఉద్యోగులకు నైపుణ్యాలు కల్పించి మెరుగైన పౌరసేవలు అందించేలా చర్యలు చేపడుతున్నాం. ఐగాట్- మిషన్ కర్మయోగి కార్యక్రమం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఈ నైపుణ్యాలను పెంచుతోంది. మన ఉద్యోగులు 2.2 కోట్ల కోర్సులు చేసి దేశంలోనే ఏపిని అగ్రస్థానంలో నిలిపారు. ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఓ ఉపాధ్యాయురాలు 4 వేల పైచికులు కోర్సులు చేసి నైపుణ్యాలు సాధించింది. ఇప్పుడు తన విద్యార్థులకు ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా విద్యను అందించేందుకు ఆ నైపుణ్యాలు ఆమెకు ఉపయోగ పడుతున్నాయి. వ్యక్తిగతంగా మనం కూడా మనమన రోజువారీ కార్యక్రమాలను మరింత మెరుగ్గా నిర్వహించుకోవాలంటే నైపుణ్యాలు పెంచుకోవాలి. సామాజిక మాధ్యమాల్లో రీల్స్ చూడటం కాకుండా నైపుణ్యాలు పెంచుకునే అంశంపై సమయం కేటాయించాలని కోరుతున్నాను." అని సీఎం సూచించారు.

**అభివృద్ధి అంశంలో రాజీలేదు :** "గత పాలకులు పట్టాదారు పాస్ పుస్తకాలు, సర్వేరాళ్లపై బొమ్మలు వేసుకోడానికి రూ.800 కోట్లు ఖర్చు పెట్టారు. రీసర్వే 2.0 ద్వారా భూవివాదాలు పరిష్కరించి రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేస్తున్నాం. శెట్టిపల్లి, కంగుమంది, అమలాపురం తదితర ప్రాంతాల్లో దశాబ్దాలుగా ఉన్న భూసమస్యల్ని పరిష్కరించాం. బ్లాక్ చెయిన్ టెక్నాలజీ ద్వారా రెవెన్యూ రికార్డులను భద్రంగా పెడుతున్నాం. ఇప్పటికే 5.5 లక్షల ఇళ్లను పూర్తి చేసి పేదలకు అందించాం. మరో 5.5 లక్షల ఇళ్లను త్వరలోనే నిర్మించి ఇస్తాం. పౌర సేవల్ని ప్రజలకు దగ్గర చేసేలా వాట్సప్ గవర్నెన్సు ద్వారా సేవలు అందిస్న?న్నాం. డీప్ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చాక రోజులు, నెలలు పట్టాల్సిన పనులు ఇప్పుడు నిముషాల్లోనే పూర్తి అవుతోంది. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ వివిధ రంగాల్లో అభివృద్ధి సాధిస్తోంది. రాష్ట్రంగా మనం అవకాశాలను అందిపుచ్చుకోవాలి. విశాఖకు డేటా సెంటర్లు తీసుకువస్తే గొడ్డలి పార్టీ నీటి సమస్య అంటూ అడ్డుపడుతోంది. అమరావతి అంటే ఎడారి అని, శ్మశానమని, మావిగన్ అంటున్నారు. అడ్డంకులకు ఆగిపోను, అభివృద్ధి విషయంలో రాజీ పడను. నాయకుడంటే ప్రజల రేపటి భవిష్యత్ గురించి ఆలోచన చేయాలి. అందుకే 2047 స్వర్ణాంధ్ర లక్ష్యంతో పనిచేస్తున్నాను. సమాజంలో చిట్టచివరి వ్యక్తి జీవన ప్రమాణాలు పెంచేలా చర్యలు చేపట్టాం. ఆదాయం, ఆరోగ్యం, ఆనందం అనే విధానంతో ముందుకు వెళ్తున్నాం." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ సమావేశానికి మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎంపీ కృష్ణప్రసాద్, నేతలు మోపిదేవి వెంకటరమణ తదితరులు హాజరయ్యారు.

# నైపుణ్యంతో.. యువతకు ఉపాధి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దఎత్తున చేపడుతున్న నైపుణ్య శిక్షణ కార్యక్రమాల సమర్థ అమలు ద్వారా యువతకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి కల్పనకు చర్యలు తీసుకోవాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో నైపుణ్యాభివృద్ధి విభాగం ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా యువతకు ఏపీఎస్ఎస్ డీసీ ద్వారా చేపడుతున్న వివిధ నైపుణ్య శిక్షణ కార్యక్రమాల అమలుతీరు, ప్రగతిని అధికారులు వివరించారు. పీఎం కౌశల్ వికాస్ యోజన పథకం వినియోగంలో ఉత్తరప్రదేశ్ తర్వాత ఏపీ రెండోస్థానంలో నిలిచిందని అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 192 పీఎంకేవీవై సెంటర్స్ అప్ గ్రేడ్ కు సమావేశంలో నిర్ణయించారు. నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగాల కల్పన విషయంలో స్వల్పకాలిక, దీర్ఘకాలిక లక్ష్యాల సాధనకు ప్రణాళికలు రూపొందించాలని మంత్రి నిర్దేశించారు. పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్ సమర్థ వినియోగంపైనా మంత్రి సమీక్షించారు. నిరుద్యోగులకు పెద్దఎత్తున ప్రయోజనం కల్పించే దిశగా చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా మంత్రి ఆదేశించారు.



**నైపుణ్య విభాగం కింద ఇప్పటివరకు 5.43 లక్షల మందికి ఉద్యోగాల కల్పన :** నైపుణ్యాభివృద్ధి విభాగం కింద ఇప్పటివరకు 5.43 లక్షల మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించినట్లు అధికారులు వివరించారు. ప్లేస్ మెంట్ రేట్ లో నేషనల్ యావరేజ్ 64 శాతం ఉండగా.. స్టేట్ యావరేజ్ 76శాతంతో ప్రధాన రాష్ట్రాల్లో ప్లేస్ మెంట్ ఫెర్ఫార్మెన్స్ లో ఏపీ మొదటిస్థానంలో నిలిచింది. యువతకు పెద్దఎత్తున నైపుణ్య శిక్షణ అందించిన రాష్ట్రాల్లో ఏపీ రెండో స్థానంలో నిలిచింది. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన జాబ్ మేళాల ద్వారా 1.02 లక్షల మంది యువతకు ఉద్యోగాలు లభించాయి. సీడాప్ ద్వారా 2024 ఏడాదిలో 41,288 మందికి శిక్షణ అందించినట్లు అధికారులు వివరించారు. సీడాప్ ద్వారా ఉద్యోగాల కల్పన విషయంలో 76శాతం ప్లేస్ మెంట్ ఫెర్ఫార్మెన్స్ తో దేశంలోనే ఏపీ మొదటి స్థానంలో నిలిచిందని, యువతకు పెద్ద ఎత్తున నైపుణ్య శిక్షణ అందించిన ప్రధాన రాష్ట్రాల్లో ఏపీ రెండో స్థానంలో నిలిచిందని తెలిపారు. సీడాప్ ద్వారా ఏడాదికి లక్ష మంది యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పెట్టుకోవాలని ఈ సందర్భంగా మంత్రి ఆదేశించారు. ఓంక్యాప్, సీడాప్ అనుసంధానం ద్వారా పెద్దఎత్తున యువతకు విదేశాల్లో ఉద్యోగాల కల్పనకు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. పీఎం సేతు కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఐటీఐలను 18 క్లస్టర్లుగా విభజించి.. విశాఖ క్లస్టర్ కు ఏఎంఎన్ఎస్(ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్) పారిశ్రామిక భాగస్వామిగా వ్యవహరిస్తుంది. మిగతా క్లస్టర్లకు కూడా పారిశ్రామిక భాగస్వాములను త్వరితగతిన ఎంపిక చేయాలని మంత్రి ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో ఏపీ విద్య, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ విభాగం ముఖ్య కార్యదర్శి జే.శ్యామలరావు, ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఎండీ, సీఈవో జీ.గణేష్ కుమార్, ఏపీ ఉన్నత విద్యా మండలి ఇంఛార్జ్ ఛైర్మన్ ఎస్.విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# బుర్రిపాలెం సీఎం సభను విజయవంతం చేయాలి





(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సీఎం సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని అన్నారు. గ్రామస్థాయి నుంచి ప్రతి కార్యకర్త ప్రజలను సభకు తరలించేందుకు చొరవ చూపాలని, నాయకులు పరస్పర సమన్వయంతో బాధ్యతలు చేపట్టాలని సూచించారు.

సభ విజయవంతం చేయడం ప్రతి టీడీపీ నాయకుడు, కార్యకర్త బాధ్యతగా భావించాలని ఆలపాటి పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రవాణా, తాగునీరు, ఇతర అవసరమైన ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. సభకు వచ్చే ప్రజలకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేలా స్థానిక నాయకత్వం ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.

సీఎం పర్యటన నేపథ్యంలో తెనాలి నియోజకవర్గంలోని పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. గ్రామాల వారీగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి సభకు భారీగా ప్రజలను తరలించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారు.

సమావేశంలో తెనాలి నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు అప్పసాని రాజేష్, జడ్పీటీసీ మాజీ చైర్‌పర్సన్ క్రిస్టియాన, టీడీపీ నాయకులు పెమ్మసాని రవికుమార్, కత్తెర సురేష్ కుమార్, ప్రజాప్రతినిధులు, మండల, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పరిశుభ్రతకు.. 'స్వచ్ఛ' పురస్కారం

(మొదటి పేజీ తరువాయి)

చేతుల పరిశుభ్రతకు అవసరమైన సదుపాయాలకు 25 శాతం, మరుగుదొడ్ల పరిశుభ్రత, నిబంధనల అమలుకు 20 శాతం, ఇన్‌ఫెక్షన్ల నియంత్రణకు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించేందుకు 15 శాతం, పరిశుభ్రతపై స్పష్టమైన సూచనలు, సందేశాల ప్రదర్శనకు 10 శాతం ప్రాధాన్యం ఇచ్చారు. ఈ ఐదు అంశాల ఆధారంగా పరిశీలన చేపట్టి వచ్చిన మార్కుల ప్రాతిపదికన ఆసుపత్రులను ఎంపిక చేశారు.

**ఆసుపత్రులవారీగా :** స్వచ్ఛ ఆంధ్ర అవార్డులకు ఎంపికైన 12 ప్రభుత్వ ఆసుపత్రుల్లో కృష్ణా జిల్లాలోని కనుమోలు, ఎన్టీఆర్ జిల్లాలోని కొణకంచి, అనకాపల్లిలోని ప్రభుత్వ ఆయుష్ వైద్యశాలలు ఉన్నాయి.

ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలోని ఆత్మకూరు జిల్లా ఆసుపత్రి, పశ్చిమగోదావరి జిల్లాలోని ఆచంట, విశాఖపట్నం జిల్లాలోని పెందుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రాలు ఎంపికయ్యాయి. కర్నూలు జిల్లాలోని ఆస్పరి, మార్కాపురం జిల్లాలోని కొణకనమిట్ల, ఎన్టీఆర్ జిల్లాలోని ఇబ్రహీంపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కూడా ఈ అవార్డులకు ఎంపికయ్యాయి. మంగళగిరిలోని ఇందిరానగర్, తిరుపతిలోని ప్రకాశం రోడ్డు, విశాఖపట్నం జిల్లాలోని చినముషిడివాడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సైతం స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు అందుకోనున్నాయి. స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల ప్రదానోత్సవం అక్టోబర్ 2న విజయవాడలోని ఏ-కన్వెన్షన్‌లో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపికైన 12 ప్రభుత్వ ఆసుపత్రులకు స్వచ్ఛ ఆంధ్ర రాష్ట్రస్థాయి అవార్డులు అందజేయనున్నారు. మరోవైపు.. జిల్లాల స్థాయిలోనూ సదరు జిల్లా కలెక్టర్ ద్వారా స్థానికంగా ఎంపిక చేసిన ఆసుపత్రులకు అవార్డుల ప్రదానం జరగనుంది

# ఆక్వా కాలుష్యంపై.. కొరడా!

(మొదటి పేజీ తరువాయి)

ఆక్వా పరిశ్రమల్లో అమలు చేస్తున్న ప్రమాణాలపై సమీక్షించారు.

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 128 ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లు, ప్రీ-ప్రాసెసింగ్ యూనిట్లు ఉండగా, 82 యూనిట్ల నుంచి నమూనాలు సేకరించి పరీక్షించినట్టు ఈ సందర్భంగా ఏపీ కాలుష్య నియంత్రణ మండలి మెంబర్ సెక్రటరీ తన నివేదిక ద్వారా ఉప ముఖ్యమంత్రివర్యులకు తెలియజేశారు. అందులో 49 యూనిట్లు నిర్దేశిత ప్రమాణాలను పాటించడం లేదని, నిబంధనలు పాటించని యూనిట్లను పరిశీలించగా బీఓడీ స్థాయిలు లీటరుకు 30 మిల్లీగ్రాములకుగాను, 321 మిల్లీగ్రాములు నమోదైనట్లు వివరించారు. సుమారు 64 శాతం యూనిట్లలో 90 మిల్లీగ్రాములకు మించి ఉన్నట్టు తెలిపారు. టీఎస్ఎస్ స్థాయిలు కూడా ప్రమాదకర రీతిలో ఉన్నాయని, లీటరుకు 365 మిల్లీగ్రాములు నమోదయ్యాయని, నిర్దేశిత ప్రమాణాల మేరకు 50 మిల్లీగ్రాములు మించరాదని తెలిపారు. ఇది జలవనరులపై తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "ఇంత యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘించడం ఆమోదయోగ్యం కాదు. కాలుష్యాన్ని మూలాల వద్దే నివారించడం అత్యంత కీలకం. ఆక్వా ప్రాసెసింగ్ కార్యకలాపాల నుంచి వెలువడే మురుగు నీరు నదులు, కాలువలు, చెరువులు, సాగర సంగమ ప్రాంతాలు, భూగర్భ జలాలు తదితర నీటి వనరులను కలుషితం చేయకుండా చర్యలు తీసుకోవాలి. ప్రజల జీవనాధారానికి, వ్యవసాయానికి, మత్స్య సంపదకు, పర్యావరణ వ్యవస్థలకు ఈ నీటి వనరులే అత్యంత కీలకం. పరిశ్రమలు కచ్చితంగా కాలుష్య నియంత్రణ మండలి నిర్దేశిత ప్రమాణాలు అమలు చేయాలి.

**పారిశ్రామిక అభివృద్ధికి, పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం :** ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లలో నిర్దేశిత ప్రమాణాలు అమలును ప్రతి 15 రోజులకు ఒకసారి పరీక్షించాలి. ఎప్పటికప్పుడు పరిశీలనలకు సంబంధించిన నివేదికలను సమర్పించాలి. అదే సమయంలో నిబంధనలు అమలులో ఏవైనా సాంకేతికపరమైన, నిర్వహణపరమైన సవాళ్లు ఉంటే పరిశ్రమల ప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలి. సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలను పరిశీలించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కూటమి ప్రభుత్వం స్థిరమైన పారిశ్రామిక అభివృద్ధికి, పర్యావరణ పరిరక్షణ, నీటి వనరుల సంరక్షణకు కట్టుబడి ఉంద"న్నారు.

ఈ సమావేశంలో సీఫుడ్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ ప్రాంత అధ్యక్షులు కె. ఆనంద్ కుమార్, ప్రాంతీయ కార్యదర్శి, డి. దిలీప్, ఉపాధ్యక్షులు యు. జోగి వర్మ, తోట జగదీష్, ఐ. సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.





# పేదలకు అండగా.. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు

## లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్





**తెనాలి, అక్టోబరు 1 (జర్నలిస్ట్ ఫైల్):** పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన వర్గాలకు ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లను తెనాలిలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పంపిణీ చేశారు. లబ్ధిదారులను కలిసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఆర్థిక భద్రత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పేద కుటుంబాలకు ఆర్థికంగా ఎంతో తోడ్పాటునిస్తున్నాయని పేర్కొన్నారు. వృద్ధాప్యం, వైకల్యం, వితంతుత్వం వంటి పరిస్థితుల్లో ఉన్న వారికి ఈ పింఛన్లు ఆత్మస్థైర్యాన్ని కల్పిస్తున్నాయని తెలిపారు. ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు.

పింఛన్ల పంపిణీ సందర్భంగా లబ్ధిదారుల నుంచి స్థానిక సమస్యలను తెలుసుకున్న ఎమ్మెల్సీ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయ సిబ్బంది, పింఛన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.





## ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహం



**అమరావతి, అక్టోబరు 1(జర్నలిస్ట్ ఫైల్)** : విశాఖపట్నంలో నవంబర్ 12, 13 తేదీల్లో జరగనున్న 31వ సీఐఐ పార్ట్నర్‌షిప్ సమ్మిట్-2026కు సన్నాహకంగా రాష్ట్రవ్యాప్తంగా ఐదు ప్రాంతీయ ఎంఎస్ఎంఈ సదస్సులు నిర్వహించనున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. అక్టోబరు 7న విశాఖపట్నం, 12న కాకినాడ, 16న గుంటూరు, 23న అనంతపురం, 26న తిరుపతిలో సదస్సులు జరుగుతాయని చెప్పారు. ప్రతి సదస్సులో ఎంఎస్ఎంఈ ఎగ్జిబిషన్లు, వెండర్ డెవలప్‌మెంట్, బయ్యర్-సెల్లర్ సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిపాదించిన 'ఇంటికో పారిశ్రామికవేత్త' లక్ష్యానికి అనుగుణంగా యువత, మహిళలు, విద్యార్థులు, స్వయం సహాయక సంఘాల సభ్యులను పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సహించేందుకు సదస్సులు దోహదపడతాయని మంత్రి తెలిపారు. వ్యాపారాల స్థాపన, బ్యాంకు రుణాలు, ప్రభుత్వ కొనుగోళ్లు, ఎంఎస్ఎంఈ పాలసీ-4.0 రాయితీలపై అవగాహన కల్పించడంతో పాటు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ల ద్వారా ఇన్‌క్యుబేషన్, సాంకేతిక సహకారం అందిస్తామని చెప్పారు.

ప్రాంతీయ అవసరాలకు అనుగుణంగా విశాఖలో టెక్నాలజీ, డీప్‌టెక్, తిరుపతిలో ఎలక్ట్రానిక్స్, అనంతపురంలో గ్రీన్ ఎనర్జీ, భారీ పరిశ్రమలు వంటి రంగాలపై దృష్టి సారించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. పరిశ్రమలకు ఆన్‌లైన్ అనుమతులు అందించే సింగిల్ డెస్క్ వ్యవస్థను కూడా సదస్సుల్లో ప్రదర్శిస్తామని, పారిశ్రామికవేత్తలు, స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈ నిర్వాహకులు సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

# 'సంజీవని'పై 1.02 లక్షల మందికి శిక్షణ

ఆశాల నుంచి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారులకు శిక్షణ ఇచ్చేలా ప్రణాళిక
2008 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రత్యేక సదుపాయాలు
2,277 మంది పేషెంట్ కోఆర్డినేటర్ల నియామకం
వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో 'సంజీవని' కింద వైద్య సేవలను జనవరి 1 నుంచి ప్రారంభించేందుకు వీలుగా వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేసే అన్ని స్థాయిలోని వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది, అధికారులు కలిపి 1.02 లక్షల మందికి శిక్షణ ఇవ్వబోతున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. డిసెంబరు 10న సంజీవని సేవలను ట్రయల్ రన్ కింద ప్రారంభిస్తామని వెల్లడించారు, 2027 జనవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా పూర్తిస్థాయిలో అమలు చేస్తామని వెల్లడించారు. ఈమేరకు సంజీవని ప్రాజెక్టు అమలు కింద తీసుకుంటున్న చర్యలపై ఉన్నతాధికారులతో మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారంనాడు సమీక్ష జరిపారు. ఈ మేరకు ఒక ప్రకటన జారీ చేశారు.

**2,008 ఆరోగ్య కేంద్రాల్లో సంజీవని ఏర్పాట్లు :** రాష్ట్రవ్యాప్తంగా 2,008 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సంజీవని సేవల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. వీటిలో 537 కేంద్రాల్లో సంజీవని సేవల కోసం ప్రత్యేక గదులను సిద్ధం చేస్తున్నారు. మరో 1,726 కేంద్రాల్లో నిరంతర విద్యుత్తు సరఫరా ఉండేలా యూపీఎస్ లేదా ఇన్వర్టర్ సదుపాయాలను కల్పించనున్నారు. ఈ ఏర్పాట్లను నవంబరు 30 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సంజీవని సేవలకు అవసరమైన కంప్యూటర్లు, ట్యాబ్లెట్లు, ప్రింటర్లు, స్కానర్లు, యూపీఎస్‌లు, వెబ్ కెమెరాలు, స్పీకర్లు, హెడ్‌ఫోన్లు తదితర పరికరాలను ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ద్వారా సమకూరుస్తున్నారు.

**2,277 మంది రోగి సేవల సమన్వయకర్తలు :** సంజీవని ప్రాజెక్టు అమలులో భాగంగా రాష్ట్రంలోని వైద్య కేంద్రాల్లో 2,277 మంది రోగి సేవల సమన్వయకర్తల(సిహెచ్ ఓలు-పేషెంట్ కోఆర్డినేటర్లు) గుర్తించి నియమించే ప్రక్రియ చేపట్టారు. వీరు రోగులకు అందించే సేవల సమన్వయం, వైద్య సమాచార నమోదు, సంబంధిత ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రుల మధ్య సమన్వయం చేస్తారు. వీరిని ప్రధానంగా సామాజిక ఆరోగ్య అధికారులు, మధ్యస్థాయి ఆరోగ్య సేవల సిబ్బంది(డిజిగ్నేషన్ రాయాలి) నుంచి ఎంపిక చేస్తున్నారు. అదనంగా 76 మంది జిల్లా స్థాయి సేవల సమన్వయకర్తలను గుర్తించారు. ప్రాథమిక, ద్వితీయ, తృతీయ స్థాయిల్లోని ఆసుపత్రుల మధ్య సమన్వయం మెరుగుపరిచేందుకు వీరిని వినియోగించనున్నారు. సంజీవని సేవల అమలులో ఎదురయ్యే సమస్యలను గుర్తించడం, సంబంధిత విభాగాలతో సమన్వయం చేసుకోవడం, సేవలు సజావుగా సాగేలా చూడటం వీరి బాధ్యతల్లో భాగంగా ఉంటుంది.

**12 నుంచి శిక్షణా కార్యక్రమాలు :** టాటా సంస్థ వారు సంజీవని కింద చేపట్టే కార్యక్రమాల వివరాలను ఆన్‌లైన్‌లో ఎలా నమోదు చేయాలి, రోగులకు ఎలాంటి సర్వీసులు అందించాలి, పరీక్షలు ఎలా జరపాలి, అపాయింట్‌మెంట్లు ఎలా ఇప్పించాలి, తీసుకోవాల్సిన ఇతర చర్యలపై శిక్షణా కార్యక్రమాల ద్వారా వైద్యులు, ఇతర సిబ్బందికి శిక్షణ ఇస్తారు. ఈ శిక్షణ కార్యక్రమాలను రాష్ట్ర, జిల్లా స్థాయుల్లో ప్రత్యక్షంగా, వర్చువల్ విధానంలో నిర్వహించనున్నారు. రోగి సేవల సమన్వయకర్తలకు అక్టోబరు 12 నుంచి నవంబరు 6 వరకు శిక్షణ ఇవ్వనున్నారు. అనంతరం నవంబరు నెలలో వైద్యులు, వైద్య సహాయక సిబ్బంది, క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ అందించనున్నారు. డిజిటల్ పద్ధతిలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం, పని విధానాలను అనుసంధానించడం, ఆరోగ్య గుర్తింపు సంఖ్య నమోదు చేయడం వంటి అంశాల్లో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలకు శిక్షణ ఇవ్వనున్నారు. సంజీవని వ్యవస్థలో నిర్దేశించిన విధానాలను సిబ్బంది సక్రమంగా అనుసరించేలా శిక్షణ ఇస్తారు. మరోవైపు మంగళగిరి ఎయిమ్స్‌లో డాక్టర్ ఎన్టీఆర్ జిల్లా, కృష్ణా, పశ్చిమ గోదావరి, ఏలూరు, కోనసీమ, తూర్పు గోదావరి, కాకినాడ జిల్లాల అధికారులకు సంజీవని అమలుపై శిక్షణ ఇచ్చారు.

**74 వైద్య సమాచార వ్యవస్థల అనుసంధానం :** సంజీవని ప్రాజెక్టుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన సుమారు 74 వైద్య అప్లికేషన్స్(పోర్టల్ ఇతర), అనుసంధానం చేయనున్నారు. తొలి దశలో వైద్య సేవలు, క్షేత్రస్థాయి కార్యకలాపాలు, పర్యవేక్షణకు అవసరమైన ముఖ్యమైన వ్యవస్థలను అనుసంధానించనున్నారు. ఈ ప్రక్రియను డిసెంబరు 10 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో నెక్స్ట్‌జెన్, ఈ-ఔషధి వంటి వ్యవస్థలు ఉన్నాయి. తదుపరి దశల్లో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవల ట్రస్టు వ్యవస్థలు, ప్రజల ఆరోగ్య పరీక్షలకు సంబంధించిన వివరాలు, వైద్య నిర్ధారణ వ్యవస్థలు, కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య సమాచార వేదికలను అనుసంధానించనున్నారు. ఈ అనుసంధానం ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, క్షేత్రస్థాయిలో నమోదు చేసిన సమాచారాన్ని వివిధ వైద్య సేవలకు ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది. ఒకే సమాచారాన్ని పలుమార్లు నమోదు చేయాల్సిన అవసరాన్ని తగ్గించి, వైద్య సేవల నిర్వహణలో సమన్వయం పెంచడం ఈ చర్యల లక్ష్యం.

**మంగళగిరిలో రాష్ట్రస్థాయి ఇంటిగ్రేటెడ్ అండ్ కంట్రోల్ సెంటర్ :** మంగళగిరిలో టాటా ఎండీ సంస్థ ఆధ్వర్యంలో 'స్టేట్ సంజీవని ఇంటిగ్రేటెడ్ అండ్ కంట్రోల్ సెంటర్' ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ కేంద్రం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సంజీవని సేవల నిర్వహణను పర్యవేక్షించి, అవసరమైన సమన్వయం చేయనున్నారు. ఇందుకోసం 275 మంది సిబ్బందిని నియమించి, శిక్షణ ఇచ్చే ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లా స్థాయి సాంకేతిక సిబ్బందికి ప్రత్యక్షంగా, విధుల్లో భాగంగా శిక్షణ అందించనున్నారు. నవంబరు 30 నాటికి ఈ కమాండ్ కంట్రోల్ సేవలు వేగాన్ని అందుకుంటాయి.

## డైట్ చార్జీల పెంపు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** బీసీ హాస్టళ్లు, గురుకులాల డైట్ ఛార్జీలు పెంచుతూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత హర్షం వ్యక్తంచేశారు. పెంచిన డైట్ ఛార్జీలతో మరింత నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించడానికి వీలుకలుగుతుందన్నారు. పెరిగిన డైట్ ఛార్జీలకు అనుగుణంగా మెనూలో మార్పులు చేసినట్లు వెల్లడించారు. ఈ మేరకు మంత్రి సవిత గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పెరిగిన ధరల నేపథ్యంతో పాటు విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన భోజనం అందించేలా కూటమి ప్రభుత్వం డైట్ ఛార్జీలు పెంచుతూ ఉత్తర్వులు జారీచేసిందన్నారు. పెంచిన డైట్ ఛార్జీలు గురువారం నుంచే అమల్లోకి రానున్నట్లు తెలిపారు. 3 నుంచి 6 తరగతి విద్యార్థుల డైట్ రూ. 1,150ల నుంచి 1,265కు పెంచారన్నారు. 7 నుంచి 10వ తరగతి విద్యార్థులకు రూ. 1,400ల నుంచి రూ. 1,600లకు, ఇంటర్, ఆపై తరగతి విద్యార్థులకు రూ. 1,600ల నుంచి 1,800లకు పెంచారన్నారు.

**ఆరు రోజులు గుడ్లు... మూడ్రోజులు చికెన్ :** పెంచిన డైట్ ఛార్జీలకు అనుగుణంగా నూతన మెనూ అమలు చేయనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. కొత్త మెనూ ప్రకారం వారంలో ఆరు రోజులు గుడ్లు, మూడ్రోజులు చికెన్, రోజూ పాలు, పండ్లు అందజేయాలని ఉత్తర్వులు పేర్కొన్నారు. చిరుధాన్యాలతో చిక్కీలు, రాగి లడ్డూలు, పప్పులు, ఆకు, ఇతర కూరగాయలతో సమతుల్య ఆహారం అందించనున్నామన్నారు. విద్యార్థులను నాణ్యమైన పౌష్టికాహారం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు.

**సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు :** బీసీ విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెంచుకుని డైట్ ఛార్జీలు పెంచినందుకు సీఎం చంద్రబాబుకు మంత్రి సవిత ధన్యవాదాలు తెలిపారు. బీసీ హాస్టళ్లు, గురుకులాల్లో సొంతింటిని మరిపించేలా పౌష్టికాహారం అందజేస్తున్నామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలతో బీసీ విద్యార్థులు రాబోయే టెన్త్, ఇంటర్ లో అత్యుత్తమ ఫలితాలు రాబట్టాలని మంత్రి సవిత కోరారు.

## పీఆర్సీ కమిటీ ఛైర్మన్ నియామకంపై ఎన్జీజీఓ సంఘం హర్షం

- **25 రోజుల్లోనే సీఎం హామీలకు ఉత్తర్వులు జారీ చేయడం అభినందనీయం**
- **ఏపీ ఎన్జీజీఓ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్**

**అమరావతి, అక్టోబరు 1 (జర్నలిస్ట్ ఫైల్):** 12వ వేతన సవరణ సంఘం ఛైర్మన్‌గా దినేష్ కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై ఏపీ ఎన్జీజీఓ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగుల సమస్యలు, డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

సెప్టెంబరు 5న ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలకు కేవలం 25 రోజుల్లోనే ఉత్తర్వులు జారీ చేయడం అభినందనీయమని అలపర్తి విద్యాసాగర్ పేర్కొన్నారు. ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం ప్రాధాన్యంగా పరిగణించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. 12వ పీఆర్సీ కమిటీ ఛైర్మన్‌గా దినేష్ కుమార్ నియామకంతో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతన సవరణ ప్రక్రియకు మార్గం సుగమమైందన్నారు. ఇక వేతన సవరణ ప్రక్రియకు సంబంధించిన కార్యాచరణను ప్రభుత్వం వెంటనే ప్రారంభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్యోగుల దీర్ఘకాలిక డిమాండ్ల పరిష్కారానికి ఈ చర్య కీలక ముందడుగుగా నిలుస్తుందని తెలిపారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అలపర్తి విద్యాసాగర్ కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై ప్రభుత్వం ఇదే సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని కోరారు.



ఉద్యోగుల సమస్యలు, న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఉద్యోగుల తరఫున నిరంతరం కృషిచేస్తామని అలపర్తి విద్యాసాగర్ స్పష్టం చేశారు. పీఆర్సీ ప్రక్రియ వేగంగా పూర్తై ఉద్యోగులకు ప్రయోజనం చేకూరేలా సంఘం తరఫున అవసరమైన కార్యాచరణ కొనసాగిస్తామని తెలిపారు.

## బీసీల 34 శాతం రాజకీయ హక్కు కోసం చివరి వరకూ పోరాడతాం

- **మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**అమరావతి, అక్టోబరు 1 (జర్నలిస్ట్ ఫైల్):** స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోలను హైకోర్టు కొట్టివేయడం బాధాకరమని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. అయితే తీర్పుతో బీసీల రాజకీయ హక్కుల కోసం పోరాటం ఆగదని, హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేస్తామని తెలిపారు. బీసీల రాజకీయ సాధికారతకు తెలుగుదేశం పార్టీ చట్టబద్ధ పునాది వేసిందని, 1987లో పట్టణ స్థానిక సంస్థల్లో 20 శాతం, 1995లో పంచాయతీరాజ్ సంస్థల్లో 34 శాతానికి తగ్గకుండా రిజర్వేషన్ కల్పించే చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు.

2019లో అప్పటి వైసీపీ ప్రభుత్వం 34 శాతం బీసీ రిజర్వేషన్‌తో మొత్తం రిజర్వేషన్లు 59.85 శాతానికి చేరాయని, దీనిపై 2020లో హైకోర్టు తీర్పు నేపథ్యంలో బీసీ రిజర్వేషన్ 24.15 శాతానికి పరిమితమైందని అచ్చెన్నాయుడు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డెడికేటెడ్ కమిషన్ ద్వారా బీసీల రాజకీయ ప్రాతినిధ్యంపై అధ్యయనం చేయించి, గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం రిజర్వేషన్‌కు నిర్ణయం తీసుకుందని చెప్పారు. బీసీలకు 34 శాతం రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలన్న సంకల్పంలో మార్పు లేదని, సుప్రీంకోర్టు వరకు న్యాయపోరాటం చేస్తామని, అవసరమైన అన్ని రాజ్యాంగ, న్యాయపరమైన మార్గాలను అన్వేషిస్తామని స్పష్టం చేశారు.

## కోనసీమ రైలుకు కదలిక

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** కోనసీమ ప్రాంత ప్రజల దశాబ్దాల కల అయిన కొటిపల్లి - నరసాపూర్ కొత్త బ్రాడ్‌గేజ్ రైల్వే లైన్ ప్రాజెక్టు పనులను వేగవంతం చేసేందుకు ఏపీ కూటమి ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసిందని రాష్ట్ర రోడ్లు ఢ భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు కోసం రాష్ట్ర వాటా కింద అదనంగా రూ. 100 కోట్లను మంజూరు చేసినట్లు మంత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కేంద్ర రైల్వే శాఖతో చేసుకున్న ఒప్పందం ప్రకారం ప్రాజెక్టు మొత్తం వ్యయంలో 25 శాతం నిధులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భరిస్తోందని మంత్రి తెలిపారు. ఇందులో భూసేకరణ మరియు సివిల్ వర్క్స్ ఖర్చులు కూడా అంతర్భాగంగా ఉంటాయని ఆయన తెలిపారు. గతంలో భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే చేసిన ఖర్చులను కూడా రాష్ట్ర వాటా కిందనే పరిగణనలోకి తీసుకునేందుకు రైల్వే శాఖ అంగీకరించిందని మంత్రి తెలిపారు. మంజూరైన రూ. 100 కోట్ల నిధులను తక్షణమే అమలాపురం ఆర్డీవో ఖాతాకు బదిలీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

రాష్ట్ర వాటా నిధుల లభ్యత కారణం చూపి పనులు ఎక్కడా నిలిపివేయకుండా నిరంతరాయంగా కొనసాగించాలని గతంలోనే కేంద్రాన్ని కోరడం జరిగిందని మంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్టు ప్రాధాన్యతను వివరిస్తూ.. కేంద్ర ప్రభుత్వ నిధులతో పూర్తి చేయాలని, అనంతరం రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులను చెల్లిస్తామని గతంలోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కు లేఖ రాసిన విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు.

కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కొటిపల్లి - నరసాపూర్ రైల్వే లైన్ పనులు ఇకపై శరవేగంగా సాగుతాయని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.



# భూ రీసర్వేను సకాలంలో పూర్తి చేయాలి

- విద్యార్థుల హాజరుపై ప్రత్యేక దృష్టిసారించాలి..
- మేధో వైకల్యం కలిగిన విద్యార్థులకు ఇంటి వద్దే విద్యాబోధన అందించాలి..
- జిల్లా కలెక్టర్ అంకిత్..



**భద్రాద్రి కొత్తగూడెం అక్టోబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) :** చుంచుపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ రీసర్వే ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. చుంచుపల్లి మండలంలో బుధవారం కలెక్టర్ విస్తృతంగా పర్యటించి చుంచుపల్లితండా ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మీకంగా తనిఖీ చేశారు. సర్వే ప్రక్రియను పరిశీలించి సర్వే పురోగతి, భూ సరిహద్దుల నిర్ధారణ, రికార్డుల పరిశీలనకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. చుంచుపల్లి గ్రామ పరిధిలో మొత్తం 2 వేల 27 ఎకరాల 30 గుంటల భూమి ఉన్న నేపథ్యంలో ప్రభుత్వ భూములతోపాటు వ్యవసాయ భూముల భూ రీసర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి జాప్యానికి తావులేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. అనంతరం చుంచుపల్లి తండా ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మీకంగా తనిఖీ చేసి పాఠశాలలో విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు, విద్యాబోధన, పాఠశాల పరిసరాల పరిశుభ్రత, మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి విద్యా ప్రగతిని, పాఠ్యాంశాలపై అవగాహనను తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు శాతంపై ప్రత్యేక దృష్టి సారించి, పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరయ్యేలా విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఉపాధ్యా యులకు సూచించారు. మేధో వైకల్యం కలిగిన విద్యార్థులను గుర్తించి వారి విద్యాభ్యాసానికి ఎలాంటి ఆటంకం కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాలకు హాజరు కావడంలో ఇబ్బందులు ఎదుర్కొనే అటువంటి విద్యార్థులకు ఇంటి వద్దే విద్యాబోధన అందించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి విద్యార్థి విద్యకు దూరం కాకుండా, వారి అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యార్థు లకు అందుతున్న మధ్యాహ్న భోజనం, తాగునీరు, పారిశుధ్యం తదితర సదుపాయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేలా నాణ్యమైన విద్యాబోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. భూ రీసర్వేను సకాలంలో పూర్తి చేయడంతోపాటు, పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులపై అధికారులు నిరం తరం పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నాగరాజు, సర్వే అధికారులు, పాఠశాల ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి కిసాన్ మేళా-2026..

- పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ..



**కామారెడ్డి అక్టోబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో, ఆత్మ సౌజన్యంతో కళాభారతిలో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి కిసాన్ మేళా-2026 కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతుల సంక్షేమం, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరంపై ఆయన మాట్లాడారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సహకారం, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు చేపడుతున్న చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంఘ్వాన్, మున్సిపల్ చైర్మన్ ఉమారాణి శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సందీప్, మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మి రాజగౌడ్, సొసైటీ చైర్మన్లు ఇంద్రకరణ్, సుధాకర్, శ్రీనివాస్, అనంత్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ విక్టర్, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి, ట్రైనీ ఐఏఎస్ రవి తేజతో పాటు వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కర్షకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# మార్కెట్ యార్డులను సందర్శించిన కలెక్టర్..

- అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆపరిశుభ్రత..
- రికార్డుల నిర్వహణపై కలెక్టర్ ఆగ్రహం



**పర్వతగిరి, అక్టోబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) :** వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బుధవారం పర్వతగిరి మండలంలోని కొంకపాక, పర్వతగిరి మార్కెట్ యార్డులను క్షేత్ర స్థాయి అధికారులతో సందర్శించారు. వీవోల సభ్యులతో కలిసి ఆర్గానిక్ పప్పు దినుసులు, మిల్లెట్స్, మిల్లు, అరటి, మోదుగు ఆకులతో విస్తరులు, టిఫిన్ ప్లాట్ తదితర ఏర్పాటుకు అనువైన స్థలాలను పరిశీలించారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో కంది, ఇతర పప్పు దినుసుల మిల్లును ఏర్పాటు చేయడం ద్వారా స్థానికంగా పంటలకు విలువ జోడించడంతో పాటు, మహిళా సంఘాల సభ్యులకు ఉపాధి, ఆదాయ అవకాశాలు కల్పించే అంశంపై అధికారులతో చర్చించారు. మిల్లు ఏర్పాటుకు అవసరమైన స్థలం, వివో బిల్డింగ్‌కు స్థల పరిశీలన, మౌలిక వసతులు తదితర అంశాలను పరిశీలించారు.

**అంగన్‌వాడీ టీచర్లపై ఆగ్రహం వ్యక్తం చేసిన జిల్లా కలెక్టర్..** పర్వతగిరి మండలంలోని ఉట్టితండా, దౌలత్ నగర్ అంగన్‌వాడీ కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిశుభ్రత సరిగా పాటించకపోవడంపై సంబంధిత అంగన్‌వాడీ టీచర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నారులకు యూనిఫాం తప్పనిసరిగా ఉండేలా చూడాలని, మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. శుభ్రత పరిశుభ్రత తప్పనిసరిగా ఉండేలా ఆయాలు చూడాలని ఆదేశించారు.అంగన్‌వాడీ కేంద్రాల్లో రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంపై కూడా కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. రికార్డులను సక్రమంగా నిర్వహించని అంగన్‌వాడీ టీచర్లకు, కేంద్రాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయని అంగన్‌వాడీ సూపర్వైజర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా సంక్షేమ అధికారిని ఆదేశించారు. ఉట్టి తండ లోని బుద్ధి మాధ్యమంతో ఉన్న పిల్లలను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పలకరించి వారిని భవిత సెంటర్లకు పంపించాలని జిల్లా సంక్షేమ అధికారికి సూచించారు.. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో నాగపద్మజా, జిల్లా సంక్షేమ అధికారి నాగమణి, పర్వతగిరి తహసిల్దార్ వెంకటస్వామి, ఎంపీడీవో మాలోత్ శంకర్ నాయక్, పర్వతగిరి సర్పంచ్ చీదురు శంకర్ తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలి



- తహసీల్దార్‌లను ఆదేశించిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి..

**యాదాద్రి భువనగిరి అక్టోబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) :** బుధవారం రోజు మినీ మీటింగ్ హాల్‌లో జిల్లాలోని ఆర్డీఓలు, తహసీల్దార్లతో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డిలతో కలిసి రీసర్వే, ఎస్ఐఆర్ ప్రక్రియల పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లడుతూ జిల్లాలో ప్రస్తుతం కొనసాగుతున్న రీ సర్వే ప్రక్రియను మండలాల వారీగా సమీక్షించారు. ఇప్పటి వరకు ఎన్ని గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియ పూర్తయిందని, ఎన్ని మండలాల్లో కొత్తగా రీ సర్వే పనులు ప్రారంభ మయ్యాయని అడిగి తెలుసుకున్నారు. ఇంకా రీ సర్వే ప్రక్రియలో జాప్యం జరుగుతున్న మండలాలు ఏవి, జాప్యానికి గల కారణాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని సూచించారు. అదే విధంగా ఎస్ఐఆర్ ప్రక్రియపై కూడా మండలాల వారీగా సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఇప్పటివరకు మొత్తం ఎన్ని నోటీసులు జారీ చేశారు. మండలాల వారీగా ఎన్ని నోటీసులు అంద జేశారు. వాటిలో ఎంతమేరకు ప్రక్రియ పూర్తయిందని, నోటీసులు అందుకున్నప్పటికీ స్పందించని వారు ఎంత మంది ఉన్నారనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో నోటీసులు అందుకున్న వారి నుంచి అవసరమైన వివరాలు, స్పందనలు సకాలంలో స్వీకరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రీ సర్వే, ఎస్ఐఆర్ ప్రక్రియలను నిబంధనల ప్రకారం పారదర్శకంగా, సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్య క్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జయమ్మ, రెవిన్యూ డివిజనల్ అధికారి శేఖర్ రెడ్డి, మండలాల తహసీల్దార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సంగెం గ్రామంలో అభివృద్ధి పనులకు
# ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ శ్రీకారం

- రూ.40 లక్షలతో మహిళా సంఘ భవనం, పంచాయతీ భవనం, సీసీ రోడ్డు పనులు...



**జగిత్యాల అక్టోబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) :** జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం సంగెం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ నూతన మహిళా సంఘ భవనాన్ని ప్రారంభించడంతో పాటు, గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అలాగే నూతన సీసీ రోడ్డును ప్రారంభించారు. గ్రామంలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన మహిళా సంఘ భవనాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ప్రారంభించారు. అనంతరం రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. అదేవిధంగా రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. అభివృద్ధి పనులతో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# 'సామాజిక తెలంగాణ' ఎక్కడ..?

- కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికపై జనసేన విమర్శలు..
- బీసీల ఓట్లతో గద్దెనెక్కి బీసీలకు అవకాశాలు ఇవ్వడం లేదు..
- బీసీ సోదరులు ఇప్పటికైనా ఆత్మ పరిశీలన చేసుకోవాలి..
- గత బీ.ఆర్.ఎస్. ప్రభుత్వంలో కూడా బీసీలకు న్యాయం జరగలేదు..
- జనసేన పార్టీతో మాత్రమే సామాజిక తెలంగాణ సాధ్యం అవుతుంది.
- జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్, నేమూరి శంకర్ గౌడ్ వెల్లడి..



**హైదరాబాద్, అక్టోబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో రాబోయే ఎమ్మెల్సీ, గ్రాడ్యుయేట్ నియోజకవర్గాల ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ ఇటీవల ప్రకటించిన అభ్యర్థుల ఎంపికపై జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్, నేమూరి శంకర్ గౌడ్ తీవ్ర విమర్శలు చేశారు.. "ప్రజాపాలన" పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, అన్ని వర్గాలకు సమన్యాయం చేయడంలో విఫలమవుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా ప్రకటించిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులు ఒకే వర్గానికి చెందినవారు కావడంపై రాజకీయ వర్గాలలో, ప్రజాక్షేత్రంలో అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు ప్రకటించిన ఇద్దరు అభ్యర్థులు కూడా ఒకే వర్గానికి చెందినవారు కావడం పట్ల ఆయన అసహనం వ్యక్తం చేశారు.. తాము ఏ వర్గాన్ని లేదా కులాన్ని తప్పు పట్టడం లేదని, అన్ని రాజకీయ పార్టీలలోనూ ఆ వర్గానికి చెందిన సీనియర్ నాయకులు ఉన్నారని.. ఆ వర్గానికి సంబంధించినవాళ్లు చాలామంది తమ పార్టీలో కూడా ఉన్నారని, దామోదర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, శివారెడ్డి, అదే విధంగా చాలామంది అంటే సురేష్ రెడ్డి, మాధవ రెడ్డి ఇట్లా చాలామంది ఉన్నారు. మేము ఎక్కడ కూడా ఆ వర్గాన్ని తప్పు పట్టట్లేదు. కాకపోతే సమాజంలో ఉన్నప్పుడు మనం అందరికీ న్యాయం చేసేలాగా ఉండాలి అన్నారు.. వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ జనసేన అభ్యర్థిగా బీసీ వర్గానికి చెందిన డా.గడల శ్రీనివాస్ రావుని ప్రకటించామని ఆయన గుర్తుచేశారు.. సమాజంలో అన్ని వర్గాలకు సమాన న్యాయం జరగాలనే ఉద్దేశంతో జనసేన అధినేత పదే పదే నొక్కి చెబుతున్న 'సామాజిక తెలంగాణ' కల ఏమైందని ఆయన ప్రశ్నించారు.. అధికారంలోకి వచ్చిన తర్వాత అందరినీ కలుపుకుని పోతామన్న ప్రభుత్వ తీరుకు, ప్రస్తుత అభ్యర్థుల ఎంపికకు పొంతన కుదరడం లేదని శంకర్ గౌడ్ అన్నారు.. "సమాజంలో అందరికీ న్యాయం చేయాల్సిన ప్రభుత్వాలు, కేవలం ఒకే వర్గానికి పెద్దపీట వేస్తే రాబోయే రోజుల్లో ఆ పార్టీల పరిస్థితి ఏంటి? సామాజిక తెలంగాణ సాధ్యమయ్యేనా?" అని శంకర్ గౌడ్ నిలదీశారు..

## విద్యా ప్రమాణాలపై
# ప్రత్యేక దృష్టి సారించాలి..

- జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి..
- ప్రభుత్వ పాఠశాల, అంగన్ వాడి కేంద్రాల సందర్శన..
- విద్యార్థులతో కలిసి పాఠాలను విన్న అదనపు కలెక్టర్..



**నందిగామ అక్టోబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి పేర్కొన్నారు.నందిగామ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్ వాడి కేంద్రాన్ని బుధవారం రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి సందర్శించారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న వసతుల నిర్వహణ, సమస్యలు ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆదనవు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో విశ్లేషణాత్మక ఆలోచనలు, సమస్యల పరిష్కార నైపుణ్యాలను, నిత్యం సరళంగా మాట్లాడుకునే విధంగా, అర్థమయ్యే విధంగా విద్యా ప్రమాణాలపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని పలు సూచనలు, సలహాలను అందించారు.పాఠశాలలో మొక్కలు నాటి నీళ్లను పోశారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సైదులు,ఇంచార్జ్ ఎంపిడిఓ అరుంధతి,ఎంఈఓ రాజిరెడ్డి,ఎంపిఓ చక్రధర్,సర్పంచ్ కొమ్ము కృష్ణ,ఉప సర్పంచ్ వెంకటేష్,కార్యదర్శి రాజు, ప్రధానోపాధ్యాయులు సుధాకర్, అంగన్ వాడి ఉపాధ్యాయుల, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు 467 మంది హాజరు..

- 165 పోస్టుల భర్తీకి కొనసాగుతున్న ఎంపిక ప్రక్రియ..



**మహబూబ్‌నగర్, అక్టోబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లాలో ఖాళీగా ఉన్న 165 అంగన్‌వాడీ టీచర్ పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో భాగంగా గత రెండు రోజులుగా నిర్వహించిన ఇంటర్వ్యూలకు మొత్తం 494 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 467 మంది హాజరయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ఇంటర్వ్యూలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ తన ఛాంబర్‌లో నిర్వహించారు. అభ్యర్థుల అర్హతలు, సంబంధిత వివరాలను పరిశీలిస్తూ ఎంపిక ప్రక్రియను కొనసాగించారు. ఇంటర్వ్యూ ప్యానెల్‌లో జిల్లా రెవెన్యూ అధికారి ఎ.నిర్మల, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.ఎ.శ్రీనివాసులు, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి జరీనా బేగం పాల్గొన్నారు.

# ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురైతే నడిచేదెలా..?

- తోపుడు బండ్ల వ్యాపార సామాగ్రితో నిండిపోతున్న నడకదారులు..
- మున్సిపల్ అధికారులు స్పందించాలని ప్రజల విజ్ఞప్తి..




**యాదాద్రి భువనగిరి అక్టోబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) :** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణ మున్సిపాలిటీ పరిధిలో పాదచారుల కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురవుతున్నాయి. కొందరు వ్యాపారులు ఫుట్‌పాత్‌లపై తోపుడు బండ్లు, చిరు వ్యాపారులు చిన్న చిన్న వ్యాపారాలు ఏర్పాటు చేయడంతో పాటు దుకాణాల సామాగ్రిని సైతం నడకదారులపై ఉంచు తుండటంతో పాద చారులు రోడ్డుపైకి వచ్చి నడవాల్సిన దుస్థితి నెలకొందని స్థానికులు, పాదాచార్యులు, వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పిల్లలతో షాపింగ్‌కు వెళ్లే కుటుంబాలు, మహిళలు, వృద్ధులు, చిన్న చిన్న పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫుట్‌పాత్‌లు ఖాళీగా ఉంటే సురక్షితంగా నడవవచ్చని, కానీ ఆక్రమణలతో రద్దీగా ఉండే రోడ్డుపైనే నడవాల్సి వస్తోందని వా పోతున్నారు. భువనగిరి పట్టణంలో ఇప్ప టికే పార్కింగ్ సమస్య తీవ్రంగా ఉండగా, ఫుట్‌పాత్‌లను కూడా వ్యాపారాలకు వాడటం వల్ల సమస్య మరింత పెద్దదవుతూ జటిలమ వుతోందని అంటున్నారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆక్రమణలను గుర్తించాలని, వ్యాపారులకు నిబంధనలు తెలియజేసి ఫుట్‌పాత్‌లపై తోపుడు బండ్లు, చిరు వ్యాపారులు, కూరకాయలు విక్రయించే వాళ్లు, పువ్వులు అమ్మే వాళ్లు వారి సామాగ్రి పెట్టకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అవసరమైతే తోపుడు బండ్ల వ్యాపారులకు ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించి, ఫుట్‌పాత్‌లను పూర్తిగా పాదచారులకు అందుబాటులో ఉంచాలని సూచిస్తున్నారు. ఆక్రమణలు తొలగించాక మళ్లీ రాకుండా నిరంతర పర్యవేక్షణ, రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని, ప్రజలు సురక్షితంగా నడిచే హక్కును కాపాడాల్సిన బాధ్యత మున్సిపల్ కమిషనర్ పై ఉందని పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# పోక్సో కేసులో నిందితుడికి 3 సంవత్సరాల జైలు శిక్ష

**ఖమ్మం, అక్టోబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) :** ఖమ్మం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో నిందితుడికి న్యాయస్థానం 3 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధించింది.కేసు వివరాలు.... ప్రేమ పేరుతో మైనర్ యువతిని వేధించిన ఖమ్మం నగరానికి చెందిన చెకూరి శ్రీకాంత్, 20 సం, పై ఖమ్మం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ క్రైమ్ నెంబర్ 82/2023, ఎస్ సి నెంబర్. 33/2023లో ఐపిసి సెక్షన్లు 354(ఏ), 354(డి), పోక్సో చట్టం –2012 సెక్షన్ 8 కింద నమోదైన కేసును విచారించిన మొదటి అదనపు జిల్లా సెషన్స్ కోర్టు, ఖమ్మం న్యాయమూర్తి డా. పుల్లభట్ల పొగడ కృష్ణ అర్జున్ నిందితుడిని దోషిగా నిర్ధారించి 3 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధించారు.కేసు దర్యాప్తును ఖమ్మం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎస్. శ్రీకాంత్ నిర్వహించారు. ప్రభుత్వ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జమ్ముల శరత్ కుమార్ రెడ్డి వాదనలు వినిపించారు.బాధితురాలికి న్యాయం జరిగేలా భరోసా లీగల్ ఆఫీసర్ ఎం.ఉమారాణి సహకరించారు.కేసు కోర్టు లైజన్ బాధ్యతలను కె. శ్రీకాంత్, ఎస్ఐ నిర్వహించగా, హోంగార్డ్ ఆఫీసర్ ఎం. అయూబ్ (హోంగార్డ్) సహకరించారు.కేసు దర్యాప్తు, ప్రాసిక్యూషన్, కోర్టు లైజన్ విధుల్లో సమర్థవంతంగా పనిచేసిన అధికారులను, సిబ్బందిని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.

# మహిళా సంఘాలతో సమావేశాల్లో పాల్గొనని అధికారులు

**ఖమ్మం, అక్టోబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) :**

మధిర మున్సిపాలిటీ పరిధిలో మెప్మా లో 162 సంఘాలు ఉండగా 22 వార్డులు ఉన్నాయి. 28 మంది ఆర్పీలు పనిచేస్తున్నారు. వీటన్నిటిని కలిపి ఒక టీఎంసీ గా ఏర్పాటు చేశారు. మహిళా సంఘాల్లో ఎస్ ఎస్ జి ఎస్ ఎల్ ఎఫ్ టి ఎల్ ఎఫ్ సంఘాలు ఉంటాయి. ఎస్ ఎస్ జి సంఘాలకు మొదటి లీడర్ రెండవ లీడర్ ఉంటారు. ఇలాంటి సంఘాలను 15 సంఘాలను కలిపి ఎస్ఎల్ఎఫ్ గా ఏర్పాటు చేస్తారు. ఈ ఎస్ ఎల్ ఎఫ్ ను చూడటం కోసం ఒక ఆర్పిని ఏర్పాటు చేసి ఆ ఆర్పి ద్వారా ఎస్ ఎస్ జి సంఘాల్లో రుణాలు ఇప్పించడం జరుగుతుంది. దీనికి సంబంధించి పుస్తకాలు, చెక్కుబుక్కులు వీటి నిర్వహణ ఆర్పీలు చూసుకోవాలి. వీటికి సంబంధించిన పుస్తకాలు మొత్తం ఎస్ఎల్ఎఫ్ అధ్యక్షురాలు దగ్గర ఉండాలి, కానీ ఇవన్నీ ఆర్పీలు దగ్గర ఉంచుకొని ఎస్ఎల్ఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు దగ్గర సంతకాలు మాత్రమే ఆర్పీలు తీసుకుంటున్నారు. ఇలా రుణాలు ఇప్పించే సమయంలో తమకు నగదు ఇవ్వాల్సిందే అని డిమాండ్ చేస్తున్నారు. ఇంత జరుగుతున్న అధికారులు మాత్రం ఎస్ఎల్ఎఫ్ సంఘాల సమావేశాలకు హాజరై ఆర్పీలు రుణాలు ఇప్పించే సమయంలో ఎటువంటి నగదు ఇవ్వాల్సిన అవసరం లేదని ప్రచారం చేయాలి, కానీ మధిర మున్సిపాలిటీ పరిధిలో సంఘాల సమావేశాలకు అధికారుల హాజరు కాకుండానే ఆర్పీలతోనే నడిపిస్తున్నారు. దీంతో మహిళా సంఘాల సభ్యులు తమకు పూర్తిస్థాయిలో సమాచారం అందటం లేదని ఆర్పీలకు అవసరమైన సమాచారం మాత్రమే అందిస్తున్నారని, మిగిలిన సమాచారం అందించడం లేదని పేర్కొంటున్నారు. ఆర్పీలు రుణాలు ఇప్పించే సమయంలో నగదు అడుగుతున్నారని అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవటం లేదని పేర్కొంటున్నారు. అధికారుల పర్యవేక్షణ పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఆర్పీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు దృష్టి సారించి మధిర మెప్మాలో రుణాలు తీసుకునే సమయంలో ఆర్పీలు తీసుకుంటున్న నగదు పై విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ఖమ్మం-నల్గొండ-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి

- అభ్యర్థిత్వం ప్రకటించిన కాంగ్రెస్ అధిష్టానం
- కృతజ్ఞతలు తెలిపిన డీసీసీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్



**ఖమ్మం, అక్టోబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) :** ఖమ్మం–నల్గొండ–వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా రాంరెడ్డి సర్వోత్తం రెడ్డిని కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించింది. ఈ మేరకు ఏఐసీసీ నుండి అధికారిక ప్రకటన వెలువడింది.అభ్యర్థిత్వం ప్రకటించినందుకు ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, సహచర మంత్రివర్గ సభ్యులకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావంతుల ప్రతినిధిగా, పార్టీకి నిబద్ధత కలిగిన నేతగా రాంరెడ్డి సర్వోత్తం రెడ్డికి టికెట్ ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఆయన గెలుపు కోసం ఖమ్మం జిల్లాలోని ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు.పట్టభద్రుల ఓటర్ల నమోదులోనే గెలుపు పునాది ఉందని, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు,జిల్లా నాయకులు,జిల్లా అనుబంధ సంఘ అధ్యక్షులు, బ్లాక్ మండల, పట్టణ, కాంగ్రెస్ అధ్యక్షులు, ప్రస్తుత ,మాజీ ప్రజా ప్రతినిధులు,అనుబంధ సంఘాల నాయకులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించాలని కోరారు.సర్వోత్తం రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని శ్రేణులు అందరు ఎన్నికల ప్రచారంలోకి దిగాలని సూచించారు.

# తెలంగాణ ఖమ్మం అర్బన్ సౌత్ మండల్ 70 వ ఎస్ జిఎఫ్ స్కూల్ గేమ్స్ రేజోనెన్స్ శ్రీనివాస నగర్ విద్యార్ధుల ఘన విజయం



**ఖమ్మం, అక్టోబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) :** ఖమ్మం మండల స్థాయిలో 29-09-2026న సర్దార్ పటేల్ స్టేడియం లో నిర్వహించిన సౌత్ మండల్ 70 వ ఎస్ జిఎఫ్ స్కూల్ గేమ్స్ లోనూ రేజోనెన్స్ విద్యార్థులు ప్రతిభ చూపి మండల స్థాయిలో సెలెక్ట్ అయ్యారు. ఈ పోటిలలో మా విద్యార్థులు అండర్ 17 విభాగంలో పవన్ కుమార్ కబ్బడి, అండర్ 17 విభాగంలో కృష్ణ చైతన్య, , ప్రశాంత్,శ్రావణ్ కుమార్ వాలి బాల్, అండర్ 14 కృష్ణ ప్రసాద్, జ్ఞానేశ్వర్ వాలి బాల్ పోటి లో సెలెక్ట్ అయ్యారు. విద్యార్థుల విజయం పట్ల పాఠశాల యాజమాన్యం అయిన డైరెక్టర్ ఆర్.వి. నాగేంద్ర కుమార్, నీలిమా మాటాడుతూ ఇలాంటి విజయాలు మరెన్నో సాధించేలా ప్రోత్సహిస్తూ విద్యార్థుల ప్రతిభను ఎప్పటికప్పుడు మెరుగు పరుస్తామని తెలియజేస్తూ విద్యార్థులందరికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేసారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు,విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి : జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

- అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేయాలి
- డిగ్రీ, ప్రొఫెషనల్, పీజీ కళాశాలల్లో ప్రత్యేక నమోదు కార్యక్రమాలు నిర్వహించాలి
- 25 నుంచి 60 ఏళ్ల వయస్సు గల ఓటర్లలో పట్టభద్రులను గుర్తించి నమోదు చేయాలి
- ఫారం-18ను పట్టభద్రత ధృవీకరణ పత్రంతో సమర్పించి ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి
- గతంలో 84 వేల మంది నమోదు కాగా, ఈసారి కనీసం 2 లక్షల మంది పట్టభద్రులను నమోదు చేయడమే లక్ష్యం
- పెండింగ్‌లో ఉన్న ఫారం-6, 7, 8 దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి
- వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు, జాబితా తయారీపై రాజకీయ పార్టీల \ ప్రతినిధులతో సమావేశమైన జిల్లా కలెక్టర్



**ఖమ్మం, అక్టోబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) :**

వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటరు నమోదు, జాబీతా తయారీపై ప్రత్యేక దృష్టి సారించి, అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ లో వరంగల్–ఖమ్మం– నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు, జాబితా తయారీ, ఎస్ఐఆర్ ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి సమావేశం నిర్వహించారు.జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో 1,75,858 అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్లు గుర్తించగా, వారిలో 1,69,802 మందికి నోటీసులు అందజేశామని, 1,36,208 మంది ఓటర్ల హియరింగ్ పూర్తి చేశామని తెలిపారు.పెండింగ్‌లో ఉన్న 5,460 ఫారం–6, 1,172 ఫారం–7 దరఖాస్తులు, 9,087 ఫారం–8 దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో అభ్యంతరాల సమర్పణకు అక్టోబర్ 7 చివరి తేదీ అని, నవంబర్ 5 వరకు నోటీసుల ప్రక్రియ, అభ్యంతరాల పరిష్కారం అనంతరం నవంబర్ 9న తుది ఎస్ఐఆర్ జాబితా ప్రచురించే ప్రక్రియ ఉంటుందని తెలిపారు.

**ప్రతి పట్టభద్రుడిని ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేయాలి**

వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ప్రతి ఎన్నికల సమయంలో పట్టభద్రులు తప్పనిసరిగా తాజాగా ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు.తేది: 31–10–2023 నాటికి పట్టభద్రులైన అర్హులు, 01–11–2026ను అర్హత తేదీగా తీసుకొని రూపొందించే ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో తమ పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన పట్టభద్రులు ఫారం–18ను పట్టభద్రత ధ్రువీకరణ పత్రంతో సంబంధిత ఈఆర్ఓ, ఆర్డీఓ కార్యాలయంలో లేదా ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

**2 లక్షల మంది పట్టభద్రుల నమోదు లక్ష్యం**

గతంలో ఖమ్మం జిల్లాలో సుమారు 84 వేల మంది పట్టభద్రులు మాత్రమే ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు అయ్యారని, ఈసారి కనీసం 2 లక్షల మంది పట్టభద్రులను ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేయడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ సూచించారు.ప్రతి గ్రామంలో ప్రత్యేక గ్రామసభలు, పట్టణాల్లో వార్డు సభలు నిర్వహించి ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. టామ్‌టామ్ ద్వారా ప్రచారం నిర్వహించడంతో పాటు ప్రత్యేక పోస్టర్లు, అవగాహన వీడియోలు రూపొందించి ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

**కళాశాలల్లో ప్రత్యేక నమోదు కార్యక్రమాలు**

జిల్లాలోని ప్రతి డిగ్రీ, ప్రొఫెషనల్, పీజీ కళాశాలలో ప్రత్యేక ప్రచార దినోత్సవం నిర్వహించి కళాశాల నుండి గ్రాడ్యుయేట్ పూర్తి చేసిన వారి వివరాలు తీసుకొని, అర్హులైన పట్టభద్రులను ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు.ప్రతి మండలంలో మొత్తం ఓటర్ల జాబితాను పరిశీలించి, 25 నుంచి 60 సంవత్సరాల వయస్సు గల ఓటర్లలో పట్టభద్రులైన వారిని గుర్తించి, అర్హులైన ప్రతి ఒక్కరినీ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేయడాన్ని లక్ష్యంగా పెట్టుకోవాలని తెలిపారు. ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియలో బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) కూడా చురుకుగా భాగస్వాములు కావాలని కలెక్టర్ సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ పరిధిలోని అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటరుగా నమోదు చేసుకునేలా సహకరించాలని కోరారు.

**ఎమ్మెల్సీ ఓటింగ్ విధానంపై అవగాహన కల్పించాలి**

ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత, రెండో ప్రాధాన్యత ఓటు తదితర అంశాలపై ఓటర్లకు పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలా ఓటు వేయాలి, ప్రాధాన్యతా ఓటు విధానం ఎలా ఉంటుంది అనే అంశాలపై అవసరమైన అవగాహన వీడియోలను రూపొందించి విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి సంబంధించి 01–11–2026ను అర్హత తేదీగా తీసుకొని ఓటరు జాబితా తయారీ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.ఓటర్ జాబితా నమోదు నోటిఫికేషన్ 28–09–2026న, మొదటి పునః ప్రచురణ 15–10–2026న, రెండో పునఃప్రచురణ 25–10–2026న జరుగుతుందని తెలిపారు.ఫారం–18 దరఖాస్తుల స్వీకరణకు 06–11–2026 చివరి తేదీ అని పేర్కొన్నారు.డ్రాఫ్ట్ ఓటరు జాబితా ముద్రణ 20–11–2026 నాటికి పూర్తి చేసి, 25–11–2026న డ్రాఫ్ట్ ఓటరు జాబితాను ప్రచురిస్తామని తెలిపారు. క్లెయిమ్స్, అభ్యంతరాలను 25–11–2026 నుంచి 10–12–2026 వరకు స్వీకరిస్తామని, వాటిని 25–12–2026 లోపు పరిష్కరించి, 30–12–2026న తుది ఓటరు జాబితాను ప్రచురించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.ఎమ్మెల్సీ ఓటరు నమోదు, జాబితా విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఎస్‌డీసీ సదానందం, ఆర్డీఓ శ్రీనివాస్, ఎన్నికల విభాగ డిటి అన్సారీ, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి బెల్లం వేణుగోపాల్, బీఆర్ ఎస్ వి ప్రతినిధి ఎల్. సతీష్ బాబు, సీపీఎం పార్టీ ప్రతినిధులు డి. తిరుపతి రావు, ఆర్. ప్రకాష్, ఐఎన్ సి పార్టీ ప్రతినిధులు అన్నెం గోపాల్ రావు, జి. సూర్యనారాయణ, బీఎస్పీ పార్టీ ప్రతినిధి వేల్పుల రామయ్య, బిజెపి పార్టీ ప్రతినిధి వి. రాజేష్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి స్వర్ణ సుబ్బారావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్క్రీన్ టైమ్‌కు చెక్.. పుస్తకాలతో చెలిమి

## : 'చిల్డ్రన్స్ వరల్డ్' ద్వారా యువ రచయితల ప్రయాణం



**కూకట్‌పల్లి, అక్టోబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) :**

శరవేగంగా సాంకేతిక మార్పులు చోటుచేసుకుంటున్న ప్రస్తుత కాలంలో, పిల్లలలో సృజనాత్మకతను మరియు విమర్శనాత్మక ఆలోచనా విధానాన్ని పెంపొందించడం భవిష్యత్తు కోసం చేసే అత్యంత కీలకమైన పెట్టుబడి. ఈ దృక్పథాన్ని పునరుద్ఘాటిస్తూ, 'చిల్డ్రన్స్ వరల్డ్' త్రైమాసిక పత్రిక నూతన సంచికను శ్రీ సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వెలుదండ నిత్యానందరావు అధికారికంగా విడుదల చేశారు.ప్రతి మూడు నెలలకోసారి వెలువడే 'చిల్డ్రన్స్ వరల్డ్', బాలల్లోని సహజసిద్ధమైన ప్రతిభను వెలికితీసి, అభినందించి, తీర్చిదిద్దడానికి ఉద్దేశించిన ఒక వినూత్న విద్యా వేదికగా నిలుస్తోంది. ఈ పత్రిక ప్రధానంగా పిల్లలు రాసిన సాహిత్య రచనలతో పాటు, అనుభవజ్ఞులైన రచయితలు మరియు విద్యావేత్తల విలువైన వ్యాసాలతో కూడిన ప్రత్యేకమైన సంకర (హైబ్రిడ్) రూపాన్ని కలిగి ఉంటుంది.ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆచార్య నిత్యానందరావు మాట్లాడుతూ.. యువతలో అక్షరాస్యత పెంపునకు పత్రిక అందిస్తున్న నిస్వార్థ సేవలను అభినందించారు. పిల్లలు తమ ఆలోచనలను స్వేచ్ఛగా వ్యక్తీకరించడానికి ఒక వేదికను కల్పించడం ద్వారా వ్యక్తిగత వికాసానికి మరియు దేశాభివృద్ధికి బలమైన పునాది ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు. స్క్రీన్ సమయం (డిజిటల్ సాధనాల) పరధ్యానాలు పెరుగుతున్నప్పటికీ, విద్యార్థులలో సాహిత్య పఠనాభిలాషను సజీవంగా ఉంచడానికి మేనేజింగ్ ఎడిటర్ మక్కపాటి చంద్రశేఖరరావు మరియు చీఫ్ ఎడిటర్ పి.ఎన్. భాను ప్రకాష్ వాలంటీర్లుగా చేస్తున్న కృషిని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో నిజంపేటలోని రాజధాని రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ దీపిక, తెలుగు ఉపాధ్యాయురాలు కవిత, స్కూల్ కోఆర్డినేటర్ కామేశ్వరి, లాల్ గాడి మల్కాజ్‌గిరికి చెందిన హిందీ పండితురాలు పాముల మాధవి, ఇన్వెస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ కిషోర్, షాజహాన్ మరియు జర్నలిస్ట్ సముద్రాల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.చిన్నారి రచయితలు తమ కథలు, కవితలు మరియు ఆలోచనలను ప్రచురించుకోవడానికి తగిన వేదికను అందించడం ద్వారా, 'చిల్డ్రన్స్ వరల్డ్' పత్రిక సాంప్రదాయ ప్రింట్ మీడియాను ఆధునిక విద్యా లక్ష్యాలతో మేళవించి భావి నాయకులను, ఆలోచనాపరులను మరియు రచయితలను ఎలా తీర్చిదిద్దవచ్చో నిరూపిస్తూనే ఉంది.

# ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణకు ఐక్యంగా కృషి చేయాలి

- **ఢిల్లీలో ఏఐసీసీ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ ఎంపీలు, ఎమ్మెల్యేల**
- **జాతీయస్థాయి సమావేశం – పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే లు**



**ఇల్లందు, అక్టోబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) :**

ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలతో జాతీయస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి సీతక్క, ఇల్లందు నియోజకవర్గం శాసనసభ్యులు కోరం కనకయ్య,ఎమ్మెల్యేలు, ఎంపీలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఇందిరా భవన్ ఆవరణలో భగవాన్ బిర్సా ముండా, మహాత్మా గాంధీ చిత్రపటాలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క, ఎమ్మెల్యే కోరం కనకయ్య ఇతర ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతి, హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుండి పనిచేస్తోంది. భారత రాజ్యాంగం కల్పించిన సమానత్వం, సామాజిక న్యాయం, సమాన అవకాశాలను కాపాడుకోవడం మనందరి బాధ్యత.భగవాన్ బిర్సా ముండా గిరిజన హక్కుల కోసం చేసిన పోరాటం, మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస, సామాజిక సమానత్వ మార్గం మనందరికీ స్ఫూర్తిదాయకం. వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజాప్రతినిధులుగా మనమంతా కట్టుబడి పనిచేయాలి.ఎస్సీ, ఎస్టీ ప్రజలకు విద్య, ఉపాధి, ఆర్థిక అవకాశాలు, భూమి, గృహ వసతి, వైద్యం, మౌలిక సదుపాయాలు అందేలా మరింత సమర్థవంతంగా కృషి చేయాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలి.దేశవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ ప్రజాప్రతినిధులు ఒకే వేదికపై సమావేశమై తమ ప్రాంతాల్లోని సమస్యలను చర్చించుకోవడం ఎంతో ముఖ్యమైన విషయం. ప్రజల సమస్యలను జాతీయ స్థాయిలో బలంగా వినిపిస్తూ, రాజ్యాంగ హక్కులు మరియు సామాజిక న్యాయం కోసం ఐక్యంగా ముందుకు సాగాలి అని ఎమ్మెల్యే అన్నారు.ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ వర్గాల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై ప్రజాప్రతినిధులు చర్చించారు.

# అంగడిపేట ఆంజనేయ స్వామి ఆలయంలో ఘనంగా అన్నదానం

- **పితృపక్షాల సందర్భంగా ప్రతిరోజూ సేవా కార్యక్రమాలు**
- **కీర్తిశేషులు ఉప్పలపు విజయలక్ష్మి జ్ఞాపకార్థం అన్నప్రసాద వితరణ**

**గజ్వేల్, అక్టోబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) :**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని అంగడిపేట ఆంజనేయ స్వామి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అమావాస్య అన్నప్రసాద వాసవి సేవాసమితి ఆధ్వర్యంలో, లయన్ సంజయ్ గుప్తా కుటుంబ సభ్యుల సౌజన్యంతో కీర్తిశేషులు ఉప్పలపు విజయలక్ష్మి జ్ఞాపకార్థం ఈ అన్నప్రసాద వితరణను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కొమురవెల్లి ఆలయ డైరెక్టర్ నంగునూరు సత్యనారాయణ, లయన్ గుడాల రాధాకృష్ణ, అయ్యప్ప ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి అయిత సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పితృపక్షాల పుణ్య దినాలను పురస్కరించుకుని ప్రతిరోజు దాతల సహకారంతో ఇక్కడ అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పురాణాల ప్రకారం పితృపక్షం రోజుల్లో అన్నదానం, వస్త్రదానం వంటి సేవా కార్యక్రమాలు చేయడం వల్ల విశేష పుణ్యఫలం లభిస్తుందని, పితృదేవతల ఆశీస్సులు ఉంటాయని వారు పేర్కొన్నారు. ఉప్పలపు విజయలక్ష్మి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఈ సేవకు ముందుకు రావడం అభినందనీయమన్నారు.ఈ అన్నదాన కార్యక్రమంలో లయన్ దొంతుల సత్యనారాయణ, కాశీనాథ్, శ్రీహరి, కైలాస ప్రశాంత్, సాంబయ్య, దూబకుంట లక్ష్మణ్, ఆర్యవైశ్య సంఘం నాయకులు మరియు






స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జర్నలిస్టు హిల్ కాలనీ అభివృద్ధికి కదలిక

- **జర్నలిస్టు హిల్ కాలనీ అభివృద్ధికి కదలిక**



**శామీర్‌పేట, అక్టోబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్న జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులకు నివాస స్థలాలు కేటాయించింది. అప్పటి హోంమంత్రి సబితా ఇంద్రారెడ్డి సహకారంతో మల్కాజిగిరి, అల్వాల్, జవహర్‌నగర్, శామీర్‌పేట్ ప్రాంతాలకు చెందిన జర్నలిస్టులతో పాటు శామీర్‌పేట్‌లోని నిరుపేదలకు కూడా స్థల పట్టాలు అందజేశారు.శామీర్‌పేట్‌లో కేటాయించిన జర్నలిస్టుల స్థలాలు దాదాపు 18 ఏళ్లుగా ఎలాంటి మౌలిక వసతుల అభివృద్ధికి నోచుకోక నిర్మానుష్యంగానే ఉండిపోయాయి. 2019లో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అందించిన ఆర్థిక సహకారంతో గుట్టలు, బండరాళ్లతో ఉన్న ప్రాంతాన్ని చదును చేసి నివాసయోగ్యంగా మార్చుకునేందుకు జర్నలిస్టులు స్వయంగా కృషి చేశారు.ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జర్నలిస్టు హిల్ కాలనీకి మౌలిక వసతులు కల్పించేందుకు కదలిక మొదలైంది. కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సరఫరా వంటి కనీస సదుపాయాలు కల్పించాలని కోరుతూ కాలనీ సభ్యులు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. గతంలో అల్వాల్, మల్కాజిగిరి, జవహర్‌నగర్, శామీర్‌పేట్ ప్రాంతాలకు చెందిన సీనియర్ జర్నలిస్టులు మల్కాజిగిరి జోనల్ కమిషనర్‌ను కలిసి సమస్యలను వివరించగా, రెండు రోజుల క్రితం మరోసారి కాలనీ సభ్యులు వినతిపత్రం సమర్పించారు.వినతులకు స్పందించిన అధికారులు బుధవారం జర్నలిస్టు హిల్ కాలనీని సందర్శించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించారు. మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, డీఈ మాధవాచారి, ఏఈ నీరీషా కాలనీలో పర్యటించి రోడ్లు, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల పరిస్థితిని పరిశీలించారు. కాలనీ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయడంతో త్వరలోనే మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయన్న ఆశాభావం కాలనీ సభ్యుల్లో వ్యక్తమవుతోంది.

# ఘనంగా ప్రోఆర్క్ 20వ వార్షికోత్సవ వేడుకలు




**శంషాబాద్, అక్టోబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) :** డేటా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మైక్రోసాఫ్ట్, సైబర్ సెక్యూరిటీ సొల్యూషన్స్ ద్వారా ఆధునికీకరణ, భద్రత, వ్యాపార వృద్ధికి సేవలందిస్తున్న ప్రముఖ సాంకేతిక సంస్థ ప్రోఆర్క్ తన 20వ వార్షికోత్సవ వేడుకలను శంషాబాద్ మండలం పెద్దాషాపూర్‌లోని సెరీన్ రిసార్ట్స్ అండ్ కన్వెన్షన్స్‌లో రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రోఆర్క్ సీఈవో సంతోష్ కావేటి మాట్లాడుతూ.. రెండు దశాబ్దాల క్రితం ఒక బలమైన నమ్మకంతో ప్రోఆర్క్ ప్రయాణం ప్రారంభమైందన్నారు. సరైన వ్యక్తులు ఒక లక్ష్యంతో కలిసి పనిచేస్తే సాంకేతికత అందించే అవకాశాలను వ్యాపార ఫలితాలుగా మార్చవచ్చనే విశ్వాసంతో సంస్థ ముందుకు సాగిందని తెలిపారు. క్లౌడ్, డేటా, సైబర్ సెక్యూరిటీ నుంచి ప్రస్తుతం ఏఐ వరకు చోటుచేసుకున్న ప్రతి సాంకేతిక పరిణామంలోనూ ఇదే నమ్మకం సంస్థను ముందుకు నడిపించిందన్నారు. ప్రోఆర్క్ 20 ఏళ్ల ప్రస్థానంలో ఉద్యోగుల నిబద్ధత, క్లయింట్ల విశ్వాసం, మైక్రోసాఫ్ట్ వంటి భాగస్వామ్య సంస్థల సహకారం కీలకమని సంతోష్ కావేటి పేర్కొన్నారు. ప్రస్తుతం ఏఐను ప్రయోగ దశ నుంచి వాస్తవ వినియోగంలోకి తీసుకువస్తున్న సమయంలో బలమైన పునాదులు నిర్మించడం, వ్యాపారాలను సురక్షితంగా ఉంచడం, దీర్ఘకాలిక ఫలితాలను అందించడమే సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రోఆర్క్ ప్రయాణంలో మరింత ఉత్తేజకరమైన అధ్యాయం ముందుందని అన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రోఆర్క్ ఉద్యోగులు పాల్గొన్న ఈ వేడుకల్లో మైక్రోసాఫ్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో అత్యాధునిక ఏఐ సాంకేతికతపై కీనోట్ సెషన్ నిర్వహించారు. మైక్రోసాఫ్ట్ ఏఐ విభాగం ప్రతినిధులు సందీప్ శ్రీవాస్తవ, ప్రేరణ నాయక్ స్ఫూర్తిదాయక ప్రసంగాలు చేశారు. ఏఐ రంగంలో వేగంగా వస్తున్న మార్పులు, నూతన ఆవిష్కరణలు, టెక్నాలజీ–వ్యాపార రంగాల భవిష్యత్తుపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. అనంతరం నిర్వహించిన 'ప్రోఆర్క్ డిస్కవరీ ఎక్స్‌పీరియన్స్' ఇంటరాక్టివ్ బిజినెస్ షోకేస్ ఉద్యోగులను ఆకట్టుకుంది. సంస్థ అందిస్తున్న వివిధ సేవలు, క్లయింట్ విజయగాథలు, సాంకేతిక ఆవిష్కరణలను ఉద్యోగులు తెలుసుకునే అవకాశం లభించింది. వివిధ విభాగాల మధ్య సమన్వయాన్ని పెంపొందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడింది. సాయంత్రం నిర్వహించిన గాలా వేడుకల్లో ప్రోఆర్క్ రెండు దశాబ్దాల ప్రస్థానం, విజయాలను గుర్తుచేసుకున్నారు. నాయకత్వ ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అవార్డులు, రివార్డులు, ఉద్యోగుల వినోద కార్యక్రమాలతో వేడుకలు సందడిగా సాగాయి. ఉద్యోగుల్లో ఐక్యత, ఉత్సాహం వెల్లివిరిసింది. ప్రోఆర్క్ సామాజిక బాధ్యత విభాగమైన యశోద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆరోగ్యం, శ్రేయస్సు, సమాజ హితం లక్ష్యంగా నిర్వహించిన 5కే రన్తో వేడుకలు ముగిశాయి. ఉద్యోగులు ఉత్సాహంగా రన్‌లో పాల్గొని ఆరోగ్యకరమైన జీవనశైలికి ప్రాధాన్యతను చాటిచెప్పారు.

## బుర్రిపాలెంలో సీఎం పర్యటనకు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** తెనాలి రూరల్ మండలం బుర్రిపాలెంలో ఈ నెల 4న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించనున్న నేపథ్యంలో పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్ గురువారం బుర్రిపాలెంలో పర్యటించి ప్రతిపాదిత హెలిప్యాడ్, సభా వేదిక, సీఎం కాన్వాయ్ రూట్, పార్కింగ్, ట్రాఫిక్ మళ్లింపు మార్గాలు, ప్రవేశ–నిష్క్రమణ పాయింట్లను పరిశీలించారు. పేద ఎస్టీ యానాది కుటుంబాల కోసం నిర్మించనున్న ఇళ్లకు శంకుస్థాపనతో పాటు ఇంటి తాళాల పంపిణీ కార్యక్రమం జరగనుంది.

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా సుమారు 800 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని, కాన్వాయ్ మార్గంలో ముందస్తు తనిఖీలు నిర్వహించి, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తెనాలి డీఎస్పీ బి. జనార్ధన్ రావు, సీఐ నాయబ్ రసూల్, ఎస్ఐలు, పోలీసు, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 12వ పీఆర్సీ కమిషనర్‌గా దినేష్ కుమార్ నియామకంపై ఏపీటీఎఫ్ హర్షం

- వెంటనే 30 శాతం ఐఆర్ ప్రకటించాలి: ఏపీటీఎఫ్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** 12వ పీఆర్సీ కమిషనర్‌గా మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దినేష్ కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై ఏపీటీఎఫ్ హర్షం వ్యక్తం చేసింది. సెప్టెంబరు 5న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్వహించిన సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు కమిషనర్ నియామకం జరిగిందని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి. హృదయ రాజు, ప్రధాన కార్యదర్శి ఎస్. చిరంజీవి తెలిపారు.

ఉద్యోగులు, ఉపాధ్యాయుల నుంచి అభిప్రాయాలు సేకరించడం, జిల్లాల్లో పర్యటించడం తదితర ప్రక్రియలను పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించేందుకు పీఆర్సీకి ఏడాది గడువు ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. అయితే నిత్యావసర వస్తువుల ధరలు, పిల్లల విద్యా ఫీజులు, వైద్య ఖర్చులు పెరగడంతో ఉద్యోగులపై ఆర్థిక భారం పెరిగిందని తెలిపారు.

పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకుని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు వెంటనే 30 శాతం మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించాలని ఏపీటీఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. పీఆర్సీ ప్రక్రియను వేగవంతం చేసి వేతన సవరణ ప్రయోజనాలను ఉద్యోగులకు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## నిత్య ప్రజా సేవకుడు లేళ్ళ అప్పిరెడ్డి : బందా రవీంద్రనాథ్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** నిరంతరం ప్రజల కోసమే జీవించే నిత్య ప్రజా సేవకుడు లేళ్ళ అప్పిరెడ్డి అని గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్, స్ఫూర్తి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి బందా రవీంద్రనాథ్ కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధిగా పని చేసే పేదల పెన్నిధిగా అభివర్ణించారు.

శాసనమండలి సభ్యులు, స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు లేళ్ళ అప్పిరెడ్డి జన్మదిన వారోత్సవాలు స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా అరండల్‌పేటలోని గ్యాస్ గోడౌన్ వద్ద రెడ్డి కోటేశ్వరరావు నేతృత్వంలో కేక్ కటింగ్ జరిగింది. అనంతరం శ్రీనగర్‌లోని మాతృశ్రీ వృద్ధాశ్రమంలో విద్యార్థి నేత రవీంద్ర ఆధ్వర్యంలో మహిళలకు చీరల పంపిణీ జరిగింది.

ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న బందా రవీంద్రనాథ్ మాట్లాడుతూ, ఎవరికి ఎలాంటి సమస్య వచ్చినా నేనున్నానని ముందుకొచ్చి వారి సమస్యను సొంత సమస్యగా భావించి, దాన్ని తన భుజస్కంధాలపై మోస్తూ.. వారికి అండదండగా నిలుస్తూ... వారిలో బ్రతుకు పట్ల కొండంత భరోసా నింపే అనితరసాధ్యుడు లేళ్ళ అప్పిరెడ్డి అని పేర్కొన్నారు. తన రాజకీయ ప్రస్థానంలో ఎన్నో ఒడిదుడుకులను చిరునవ్వుతో ఎదుర్కొంటూ ఆయన ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. కష్టపడి పనిచేసే వారిని గుర్తించి పైకి తేవడంలో ఆయన ఎప్పుడూ ముందుంటారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), షేక్ రోషన్, పాపతోటి అంబేద్కర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ బత్తుల దేవానంద్, కాకి శ్రీనివాసరావు, ముత్యం, ఆలా కిరణ్, ఓసూరి అంకమ్మ, అబ్దుల్ సలాం, సుబ్బరాజు, శంకర్, కోలా సాంబయ్య, శివకుమార్, తాతిశెట్టి రాజేశ్వరి, జాన్సీ, విజయారెడ్డి , శివ పార్వతి, దుర్గ, మన్నెం లక్ష్మి, చందు, సింగు నరసింహారావు, మేరువ నర్సిరెడ్డి, శివప్రసాద్, భాగ్యారావు, ప్రసన్న, సుందరరావు, దాసు, ఆనంద్, రాచకొండ ముత్యాలరాజు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# దేశంలోనే పింఛన్ల పంపిణీలో నూతన అధ్యాయం

- రూ.76 వేల కోట్ల నిధులు లబ్ధిదారులకు పంపిణీ
- వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల ఆత్మగౌరవాన్ని కాపాడుతున్నాం
- ఇది సంక్షేమ ప్రభుత్వమని చెప్పడానికి గర్వంగా ఉంది
- తూర్పులో పింఛన్లు పంపిణీ చేసిన ఎంపీ రామకృష్ణ, ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** దేశంలోనే పింఛన్ల పంపిణీ చరిత్రలో రాష్ట్ర ప్రభుత్వం నూతన అధ్యాయాన్ని లిఖించిందని, ఇప్పటికే రూ. 76 వేల కోట్లకుపైగా నిధులతో ఆర్థిక భద్రత కల్పించిందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్, రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ అన్నారు. శుక్రవారం పాత గుంటూరు కుమ్మరిబజార్ మెయిన్ రోడ్డులో పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కూటమి నాయకులు, సచివాలయ సిబ్బందితో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి ఎంపీ రామకృష్ణ, ఎమ్మెల్యే నసీర్ పింఛన్లను స్వయంగా అందించారు. పింఛన్ల పంపిణీలో ఏవైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా ? సంతోషంగా ఉన్నారా ? అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పెద్ద కొడుకులా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒకటో తేదీన పింఛన్లు అందిస్తూ ఆదుకుంటున్నారని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ రామకృష్ణ, ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ వృద్ధులు, వితంతువుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు కూటమి ప్రభుత్వం పెన్షన్లు పెంచినట్లు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో 40 వేల కోట్ల రూపాయల పింఛన్ల బకాయిలు పెట్టిందని గుర్తు చేశారు. అప్పటి బకాయిలను చెల్లించడంతో పాటు వికలాంగులు, వృద్ధులు, వితంతువుల ఆత్మగౌరవాన్ని కాపాడుతున్నామని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంలో సవాలక్ష కారణాలతో పింఛన్ల పంపిణీలో కోత విధిస్తే కూటమి ప్రభుత్వంలో స్పౌజ్ పింఛన్లు అందిస్తున్నామన్నారు. తాజాగా నూతన పింఛన్ల మంజూరుకు దరఖాస్తుల సైతం స్వీకరించామని, త్వరలోనే లబ్ధిదారులకు అందించబోతున్నామని చెప్పడానికి సంతోషంగా ఉందని తెలిపారు. ఇది సంక్షేమ ప్రభుత్వమని, ప్రతి ఒక్కరు మనసారా ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు.

# ఎన్టీఆర్ పెన్షన్లు... ప్రతి అవ్వాతాతకు భరోసా, గౌరవం

- పేదల సేవలో 2.0లో భాగంగా ఎన్టీఆర్ సామాజిక భద్రత పెన్షన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** ఎన్టీఆర్ పెన్షన్లు ప్రతి అవ్వాతాతకు భరోసా, గౌరవం అందిస్తున్నాయని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. గురువారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి "పేదల సేవలో 2.0" కార్యక్రమంలో భాగంగా 23వ డివిజన్ కన్నవారితోట 1వ లైన్‌లోని 80వ సచివాలయం పరిధిలో ఎన్టీఆర్ సామాజిక భద్రత భరోసా పెన్షన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. లిఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ..లి ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి నెలా ఒకటో తేదీ వచ్చిందంటే రాష్ట్రంలోని అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులు, డయాలసిస్ బాధితులు, మంచానికే పరిమితమైన వారు ఎంతో ఆతృతగా ఎదురుచూసే రోజు అని అన్నారు. ఎన్టీఆర్ పెన్షన్ల పంపిణీ ఇప్పుడు రాష్ట్ర ప్రజలకు ఒక పండుగలా మారిందని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పెన్షన్ల విషయంలో అత్యంత మానవీయ దృక్పథంతో వ్యవహరిస్తోందని, ఒకటో తేదీ సెలవు రోజు అయినా కూడా లబ్ధిదారులు ఎదురుచూడాల్సిన అవసరం లేకుండా ముందుగానే పెన్షన్లు అందించే విధంగా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఈ నెల 20,800 మందికి పైగా లబ్ధిదారులకు దాదాపు రూ. 8.90 కోట్ల విలువైన పెన్షన్లు అందిస్తున్నామని చెప్పారు. పెన్షన్లు అందుకున్న లబ్ధిదారుల ముఖాల్లో కనిపిస్తున్న ఆనందమే ప్రభుత్వ సంక్షేమ పాలనకు నిదర్శనమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మందుల కోసం, నిత్యావసరాల కోసం, కుటుంబ భరోసా కోసం ఈ పెన్షన్లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా కొడుకులు లేని కుటుంబాల్లో కుమార్తెల వద్ద ఉంటున్న వృద్ధులకు ప్రభుత్వం ఒక పెద్దన్నలా అండగా నిలిచి గౌరవప్రదమైన జీవితం అందిస్తోందనే భావన కనిపిస్తోందన్నారు. దివ్యాంగులకు అందిస్తున్న పెన్షన్లు వారికి ఆత్మవిశ్వాసాన్ని పెంచుతున్నాయని, డయాలసిస్ బాధితులకు నెలకు రూ. 10 వేల చొప్పున అందిస్తున్న ఆర్థిక సాయం వారి కుటుంబాలకు ఎంతో ఉపశమనం కలిగిస్తోందని చెప్పారు. అలాగే మంచానికే పరిమితమైన వారికి నెలకు రూ. 15 వేల చొప్పున అందిస్తున్న పెన్షన్ నిజంగా ఆ కుటుంబాలకు పెద్ద అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఒక సామాన్య కుటుంబం నెలంతా కష్టపడితే వచ్చే ఆదాయానికి సమానమైన మొత్తాన్ని ప్రభుత్వం నేరుగా అందించడం వల్ల వారి జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని అన్నారు.

ప్రజలకు ఇంతటి గౌరవం, భరోసా, ఆర్థిక రక్షణ కల్పిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కూటమి ప్రభుత్వానికి ప్రజలందరూ కృతజ్ఞతలు తెలుపుతున్నారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, అందుకే ప్రతి నెలా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ప్రజల హృదయాలను గెలుచుకుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## పేదలు, వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యత: ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ

- లబ్ధిదారుల ఇంటి వద్దకే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు
- వినుకొండలో లబ్ధిదారులకు స్వయంగా పెన్షన్లు అందజేసిన జీవీ



**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్ ):** అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. వినుకొండ పట్టణంలోని హనుమాన్ నగర్ లో గురువారం నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో జీవీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జీవీ పెన్షన్ లబ్ధిదారులను స్వయంగా కలిసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్ నగదును స్వయంగా అందజేశారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితర అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సామాజిక భద్రతా కార్యక్రమాల ద్వారా ఆర్థిక భరోసా అందిస్తున్నామని తెలిపారు.

ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ పేదలు, వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు మరియు ఇతర అర్హులైన వర్గాల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ప్రజల వద్దకే వెళ్లి పెన్షన్లు అందించడం ద్వారా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు నేరుగా లబ్ధిదారులకు చేరుతున్నాయని పేర్కొన్నారు. పెన్షన్ల పంపిణీ ప్రక్రియ సజావుగా జరిగేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

తమ నివాస ప్రాంతానికే వచ్చి పెన్షన్ నగదును అందజేయడంపై లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమకు అందిస్తున్న ఆర్థిక సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెనాలి పట్టణంలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ



**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లను తెనాలి పట్టణంలోని 11వ వార్డులో మధు కోనేరు అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన లబ్ధిదారులకు పింఛన్ మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పేదలు, బలహీన వర్గాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం సామాజిక భద్రతా పింఛన్లను అందిస్తోందన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

లబ్ధిదారులు పింఛన్ అందుకున్న సందర్భంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## తూర్పులో శ్మశాన వాటికలకు మహర్దశ



- ఫలించిన ఎమ్మెల్యే నసీర్ కృషి
- రూ. 7 కోట్ల నిధుల కేటాయింపు
- తొలి విడతలో భాగంగా రూ. 3.15 కోట్లతో హిందూ, ముస్లిం శ్మశాన వాటికల అభివృద్ధికి శంకుస్థాపన
- 20 ఏళ్లకు సరిపడా మౌలిక వసతులు కల్పిస్తామన్న గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు తూర్పు నియోజకవర్గంలో గత వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన శ్మశాన వాటికల రూపురేఖలు మార్చేందుకు ఎమ్మెల్యే నసీర్ చేసిన కృషి ఫలించింది. నియోజకవర్గంలో మూడు ప్రాంతాలలో హిందూ, ముస్లిం శ్మశాన వాటికల మౌలిక వసతుల కల్పనకు రూ. 7 కోట్ల నిధులు రాబట్టడం ద్వారా 20 ఏళ్ల వరకు సరిపడా అభివృద్ధికి బీజం పడింది. అందులో భాగంగా తొలి విడత గురువారం స్థానిక ఆనందపేటలో ముస్లిం, డీఎస్ నగర్లో హిందూ శ్మశాన వాటికల అభివృద్ధికి 3.15 కోట్లతో ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అంతమ సంస్కారానికి అవసరమైన శ్మశాన వాటికల అభివృద్ధి విషయంలోనూ గత వైసీపీ పాలకులు పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అంతిమ యాత్రలోనూ ఆత్మ గౌరవాన్ని కాపాడేందుకు శ్మశాన వాటికల అభివృద్ధికి కంకణం కట్టుకున్నామని అన్నారు. శ్మశాన వాటికలో మంచినీట వసతి ఏర్పాటుతోపాటు సత్రం నిర్మించబోతున్నామని తెలిపారు. నియోజకవర్గంలో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం మాత్రమే కాకుండా పార్కులు, వాకింగ్ ట్రాక్ల ఏర్పాటుకు ప్రాధాన్యమిస్తున్నామని చెప్పారు. త్వరలో పొన్నూరు రోడ్డులో వాకింగ్ ట్రాక్, పార్కుల

ఏర్పాటుకు శంకుస్థాపన చేయబోతున్నామని చెప్పారు. దీంతోపాటు బీఆర్ స్టేడియం, నల్లచెరువు, బొంగరాల బీడులోని వెల్ఫేర్ స్థలంలో వాకింగ్ ట్రాక్ పార్కుల నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా అభివృద్ధిని అన్ని వర్గాలకు చేరువ చేసేందుకు ముందడుగు వేస్తున్నామని ఈ సందర్భంగా చెప్పారు.

## 12వ పీఆర్సీ చైర్మన్ నియామకంపై యూఎంహెచ్ఈయూ హర్షం

- పీఆర్సీ నివేదికను ఆరు నెలల్లో పూర్తి చేయాలి: యూఎంహెచ్ఈయూ

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** 12వ వేతన సవరణ సంఘం (పీఆర్సీ) చైర్మన్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దినేష్ కుమార్‌ను నియమిస్తూ జీఓ ఎంఎస్ నెం. 200 జారీ చేయడంపై యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (యూఎంహెచ్ఈయూ) హర్షం వ్యక్తం చేసింది. చైర్మన్ నియామకం ఉద్యోగుల వేతన సవరణ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు దోహదపడుతుందని రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఏ.వి. నాగేశ్వరరావు, అధ్యక్షుడు కె. జగన్ మోహన్ రావు, ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వెంకటేశ్వర్లు తదితరులు తెలిపారు.

పీఆర్సీ నివేదిక సమర్పణకు ప్రభుత్వం నిర్ణయించిన ఏడాది గడువును ఆరు నెలలకు కుదించాలని యూఎంహెచ్ఈయూ కోరింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు దాటిన నేపథ్యంలో వేతన సవరణ ప్రక్రియను మరింత ఆలస్యం చేయకుండా త్వరగా పూర్తి చేయాలని, ఉద్యోగులకు వెంటనే మధ్యంతర ఉపశమనం (ఇంటీరియం రిలీఫ్) ప్రకటించాలని విజ్ఞప్తి చేసింది. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, వివిధ సంక్షేమ పథకాల ఉద్యోగులకు కూడా పీఆర్సీ ప్రయోజనాలు వర్తించేలా చర్యలు తీసుకోవాలని యూఎంహెచ్ఈయూ నాయకులు కోరారు. ఈ అంశాన్ని పీఆర్సీ చైర్మన్ పరిశీలించి నివేదికలో పొందుపరచాలని, ఉద్యోగులందరికీ సమన్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## సంపద సృష్టి పై పంచాయతీలు దృష్టి సారించాలి : ఎంపీడీవో రామచంద్రారెడ్డి



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ):** సంపద సృష్టిపై గ్రామపంచాయతీలు దృష్టి సారించాలని ఎంపీడీవో రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని అన్ని పంచాయతీల్లో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా సామూహిక శ్రమదానం సామూహిక పరిశుభ్రత తదితర కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఎంపీడీవో రామచంద్రారెడ్డి మాట్లాడుతూ పొడి చెత్త సేకరణకు దసరా ఆఫర్ ప్రకటించినట్లు ఎంపీడీవో తెలిపారు. అక్టోబర్ 24 వరకు జరిగే పొడి చెత్త సేకరణలో 10 కేజీల కంటే ఎవరైతే ఎక్కువగా చెత్త అందిస్తారో వారికి 20 శాతం ధర అదనంగా ఇస్తామన్నారు.

**మల్లేపల్లి లో పెన్షన్స్ పంపిణీ చేసిన ఎంపీడీవో :**

మల్లెపల్లె గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఎంపీడీఓ వై రామచంద్రారెడ్డి పంపిణీ చేశారు. పై కార్యక్రమాల్లో డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు పరిపాలన అధికారి నరసయ్య,ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేష్, ఏపీఎం సుబ్బరాయుడు ఏపీవో హరికృష్ణ పంచాయతీ అభివృద్ధి అధికారులు మండల పరిషత్ ఆర్డబ్ల్యూఎస్ సచివాలయ ఉద్యోగులు సిబ్బంది ప్రజలు హరిత రాయబారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల వద్దకే ప్రభుత్వం.. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు




**మైదుకూరు (జర్నలిస్ట్ ఫైల్):** ప్రభుత్వసంక్షేమ పథకాలు, సేవలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా, ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని పరిష్కరించే లక్ష్యంతో చేపట్టిన 'పేదల సేవలో 2.0' కార్యక్రమం మైదుకూరు నియోజకవర్గంలో ప్రారంభమైంది. మైదుకూరు పట్టణంలోని స్త్రీశక్తి భవన్‌లో వినాయక నగర్, నంద్యాల రోడ్, సీతారామాంజనేయపురం సచివాలయాల పరిధిలోని లబ్ధిదారులతో కార్యక్రమం నిర్వహించారు.

ముఖ్య అతిథిగా హాజరైన మైదుకూరు సీఎస్ఓ బి. ఆదిశేష రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. సంక్షేమం నుంచి సాధికారత వరకు సంక్షేమ పథకాలపై అవగాహన, ఆర్థిక–సామాజిక సాధికారత, అర్హులకు చేయూత, ప్రజా సమస్యల పరిష్కారం అనే నాలుగు అంశాలపై దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. అర్హత ఉన్నప్పటికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందని వారిని గుర్తించి, సంబంధిత శాఖల సమన్వయంతో వారికి లబ్ధి చేకూర్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. 2026 అక్టోబరు 1 నుంచి 2027 డిసెంబరు 31 వరకు 15 నెలల పాటు రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో గ్రామాలు, వార్డు సచివాలయాలను కవర్ చేస్తూ కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు.

మైదుకూరు నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, సచివాలయం, మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి వార్డుకు కార్యక్రమాన్ని చేరువ చేస్తామని అధికారులు తెలిపారు. "అర్హత ఉండి ఏ ఒక్కరూ ప్రభుత్వ పథకానికి దూరం కాకూడదు" అనే లక్ష్యంతో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తారని చెప్పారు. వార్డు సభలు, సచివాలయాల ద్వారా సమస్యలు, దరఖాస్తులు స్వీకరించి, స్థానికంగా పరిష్కరించగల వాటిని అక్కడికక్కడే పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ రంగస్వామి తెలిపారు.

ప్రజలు గ్రామ, వార్డు సభల్లో చురుకుగా పాల్గొని తమ సమస్యలు, అవసరాలను అధికారుల దృష్టికి తీసుకురావాలని, అర్హత ఉన్న సంక్షేమ పథకాల ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు, ప్రజాప్రతినిధులు కోరారు. కార్యక్రమంలో మున్సిపల్, రెవెన్యూ, ఎంపీడీవో అధికారులు, మేప్మా సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## 12వ పీఆర్సీ కమిషన్ నియామకంపై ఏపీ జేఏసీ అమరావతి హర్షం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఉద్యోగ సంఘాలతో సెప్టెంబరు 5న జరిగిన చర్చల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీల్లో భాగంగా 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమిస్తూ జీఓ ఎంఎస్ నెం.200 విడుదల చేయడంపై ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర కమిటీ హర్షం వ్యక్తం చేసింది. ఇచ్చిన హామీలను నెల రోజుల్లోనే అమలు చేస్తున్న ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. రెండు డీఏల విడుదల, అదనపు క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ పునరుద్ధరణ, 12వ పీఆర్సీ కమిషన్ నియామకం వంటి కీలక నిర్ణయాలను స్వాగతిస్తున్నట్లు చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, అసోసియేట్ చైర్మన్ టి.వి. ఫణి పేర్రాజు, కోశాధికారి తిమ్మసర్తి నాగేశ్వరరావు తెలిపారు.

అయితే పీఆర్సీ నివేదిక సమర్పణకు ఏడాది గడువు విధించడం వల్ల ఉద్యోగులకు ఆర్థిక నష్టం జరిగే అవకాశం ఉన్నందున, అందుబాటులో ఉన్న డేటా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఆరు నెలల్లోనే నివేదిక సమర్పించేలా ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌ను పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు ఉద్యోగుల వాటాతో పాటు ప్రభుత్వ వాటాను నేరుగా ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టుకు జమ చేసేలా సెప్టెంబరు 28న జీఓ 131 విడుదల చేయడాన్ని కూడా స్వాగతించారు. ఉత్తర్వుల అమలులో సాంకేతిక ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆర్థిక శాఖ ఉన్నతాధికారులను ఇప్పటికే కోరినట్లు తెలిపారు.

ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం, వాస్తవ పరిస్థితులను వివరించడం, చర్చల ద్వారా పరిష్కారాలు సాధించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని ఏపీ జేఏసీ అమరావతి నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం, ఉద్యోగ సంఘాల మధ్య నిరంతర చర్చల ద్వారా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించిన దీర్ఘకాలిక ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను దశలవారీగా పరిష్కరించాలని కోరారు. ఉద్యమం తమ లక్ష్యం కాదని, ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

## డీఎంహెచ్ఓగా బాధ్యతలు చేపట్టిన డా. పద్మావతికి ఎన్జీజీవో సంఘం శుభాకాంక్షలు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ పద్మావతిని ఏపీ ఎన్జీజీవో అసోసియేషన్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గురువారం గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా ఘంటసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ, గుంటూరు జిల్లాలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు డీఎంహెచ్ఓగా డాక్టర్ పద్మావతి చేపట్టే కార్యక్రమాలకు ఏపీ ఎన్జీజీవో అసోసియేషన్ తరఫున ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

కార్యక్రమంలో ఏపీ ఎన్జీజీవో అసోసియేషన్ గుంటూరు జిల్లా కార్యదర్శి శ్యాంసుందర్ శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్, గుంటూరు నగర అధ్యక్షుడు చింతల కళ్యాణ్ కుమార్, కార్యదర్శి కోటేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సుకుమార్, వైస్ ప్రెసిడెంట్ దుర్గారావు, జిల్లా వైస్ ప్రెసిడెంట్ అనిల్, జాయింట్ సెక్రటరీ విజయబాబు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొని డాక్టర్ పద్మావతికి శుభాకాంక్షలు తెలిపారు.

## విశ్రాంత ఉద్యోగుల సుదీర్ఘ అనుభవాన్ని సమాజ శ్రేయస్సు కోసం వినియోగించాలి



**గుడివాడ (జర్నలిస్ట్ ఫైల్) :** పదవీ విరమణ పొందిన ఉద్యోగులు తమ అనుభవం,జ్ఞానం నైపుణ్యాలను సమాజ శ్రేయస్సు కోసం వినియోగించేలా చొరవ చూపాలని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు కోరారు. గుడివాడలో సహాయ ట్రెజరీ అధికారిగా పదవీ విరమణ పొందిన కె.రాబర్ట్ మోహన్ సింగ్ సన్మాన కార్యక్రమం అంబేద్కర్ భవన్ లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సురేష్ బాబు మాట్లాడుతూ పదవీ విరమణ అనేది జీవితానికి ముగింపులా కాకుండా మరొక సరికొత్త అధ్యాయానికి నాందిగా భావించాలన్నారు.పదవీ విరమణ తర్వాత ఖాళీగా ఉండటం వల్ల మానసిక, శారీర సమస్యలు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఉద్యోగులఅనుభవాన్ని సామాన్య ప్రజలకు సలహాల రూపంలో సేవలు అందించవచ్చన్నారు. విశ్రాంత ఉద్యోగుల అనుభవం యువత,ప్రజలకు దిక్సూచిగా ఉండాలన్నారు.రాబర్ట్ సింగ్ వృత్తిపట్ల నిబద్ధత నిజాయితీతో విధులు నిర్వర్తించి అందరి మన్ననలు పొందారన్నారు. ఈసందర్భంగా పలువురు అధికారులు, ఉద్యోగ సంఘ నాయకులు, పెన్షనర్లు రాబర్ట్ సింగ్ సేవలను కొనియాడుతూ ఆయన్ని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో డిటిఏవో ఎస్.రవి కుమార్, బి.శ్రీనివాసరావు, రెడ్ క్రాస్ సభ్యులు బి.శంకర్ నాథ్ నేతలు లోకేష్ బాబు,సూర్యచంద్రరావ్,స్వామి,జ్యోతీశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మహత్యకు పాల్పడతానని వెళ్లిన మహిళను గంటలో గుర్తించిన పోలీసులు

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** ఆత్మహత్యకు పాల్పడతానని సందేశం పంపి ఇంటి నుంచి వెళ్లిపోయిన మహిళను లాలాపేట పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో గంట వ్యవధిలో గుర్తించి సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. సెప్టెంబరు 30న అర్ధరాత్రి డయల్-112కు సమాచారం అందడంతో లాలాపేట ఇన్‌స్పెక్టర్ ఏ.వి. శివప్రసాద్ వెంటనే స్పందించి మహిళ ఉన్న ప్రదేశాన్ని గుర్తించారు. రక్షక్ సిబ్బంది ఏఎస్సై వి. శ్రీకాంత్ రెడ్డి, కానిస్టేబుల్ సురేష్ అక్కడికి చేరుకుని ఆమెను క్షేమంగా తీసుకొచ్చారు.

మహిళతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్న పోలీసులు ధైర్యం చెప్పడంతో పాటు కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆత్మహత్య ఆలోచనలు వచ్చినప్పుడు ఒంటరిగా ఉండకుండా కుటుంబ సభ్యులు, స్నేహితులు లేదా పోలీసులను సంప్రదించాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్-112కు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.

## ఎమ్మెల్సీ ఆలపాటి చొరవతో రూ.40.70 లక్షల సీఎం సహాయనిధి సాయం

- తెనాలి నియోజకవర్గంలో 45 మందికి చెక్కులు అందజేసిన ఎమ్మెల్సీ ఆలపాటి



**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్):** తెనాలి నియోజకవర్గానికి చెందిన 45 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మొత్తం రూ.40,70,032 ఆర్థిక సాయం మంజూరైంది. తెనాలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ చొరవతో మంజూరైన ఈ సహాయానికి సంబంధించిన చెక్కులను గురువారం లబ్ధిదారులకు అందజేశారు.

ఆపద సమయంలో ఆర్థికంగా అండగా నిలిచిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి, ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ కత్తెర హేనీ క్రిస్టినా, పట్టణ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ ఖుద్దూస్, కత్తెర సురేష్ కుమార్, వసంతం అశోక వర్ధన, పాలడుగు సురేంద్ర, రావి చిన్ని, భీమవరపు చిన్న కోటిరెడ్డి, ఈదర వెంకట పూర్ణచంద్, పసుపులేటి త్రిమూర్తి, కోగంటి రోహిత్, మల్లవరపు విజయ్, పరుచూరి రమ్య, కొండా రమాదేవి, సుధామాధవి తదితరులు పాల్గొన్నారు.

## త్వరలోనే కొత్త పెన్షన్ల మంజూరుకు చర్యలు

- నిడదవోలు పట్టణంలో 4061 మంది లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ
- ఇంటింటికీ తిరిగి స్వయంగా పెన్షన్లు అందజేసిన మంత్రి కందుల దుర్గేష్



**నిడదవోలు (జర్నలిస్ట్ ఫైల్) :** నిడదవోలు పట్టణంలో 4,061 మంది లబ్ధిదారులకు 'ఎన్టీఆర్ భరోసా' పెన్షన్లను మంత్రి కందుల దుర్గేష్ గురువారం ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. లబ్ధిదారులను ఆత్మీయంగా పలకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు, డ్రైనేజీ సమస్యను స్థానికులు మంత్రి దృష్టికి తీసుకురాగా, వచ్చే నెలలోగా రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న మహిళను పరామర్శించి, మెరుగైన వైద్యం అందించేందుకు ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడారు.

నిడదవోలు పట్టణంలో మొత్తం 4,081 పెన్షన్లకు రూ.1.83 కోట్లకుపైగా పంపిణీ జరుగుతోందని మంత్రి తెలిపారు. కొత్త పెన్షన్ల కోసం 933 మంది దరఖాస్తు చేసుకోగా, 146 దరఖాస్తులను అ-నర్హంగా గుర్తించామని, మిగిలిన 780 దరఖాస్తులపై తుది పరిశీలన పూర్తయిందని చెప్పారు. అక్టోబరు 7న జరిగే కేబినెట్ సమావేశం అనంతరం త్వరితగతిన కొత్త పెన్షన్లు మంజూరు చేసి, వచ్చే నెల నుంచి అందించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

ప్రతి నెలా పెన్షన్ల పంపిణీ పూర్తయిన వెంటనే గ్రామ, వార్డు సభలు నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. సంక్షేమ పథకాల అమలు, లబ్ధిదారుల సమస్యలు, అభిప్రాయాలను సభల్లో తెలుసుకుని పీ4, సీఎస్ఆర్ కార్యక్రమాల ద్వారా మరింత సహాయం అందించేలా కార్యాచరణ రూపొందిస్తామన్నారు. నేటి నుంచే కార్యక్రమాన్ని ప్రారంభించి, వచ్చే నెల నుంచి పూర్తిస్థాయిలో గ్రామ, వార్డు సభలు నిర్వహిస్తామని చెప్పారు.

కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్‌ను రూ.4,000కు పెంచి ప్రతి నెలా ఒకటో తేదీన అందిస్తోందని మంత్రి దుర్గేష్ తెలిపారు. ఎన్టీఆర్ భరోసాతో పాటు తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, దీపం-2, స్త్రీశక్తి వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. సంక్షేమంతో పాటు తాగునీరు, రహదారులు వంటి అభివృద్ధి కార్యక్రమాలపై కూడా ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## హామీల అమలుపై ఎన్జీజీఓ సంఘం ప్రభుత్వానికి కృతజ్ఞతలు

- రెండు డీఏలు, ఈహెచ్ఎస్, అదనపు క్వాంటమ్ పెన్షన్, పీఆర్సీపై ఉత్తర్వులు
- ఏపీ ఎన్జీజీఓ అసోసియేషన్ గుంటూరు జిల్లా శాఖ హర్షం



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** ఏపీజేఏసీ, ఏపీ ఎన్జీజీఓ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 5న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో జరిగిన చర్చల్లో ఉద్యోగ సంఘాలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై ఏపీ ఎన్జీజీఓ అసోసియేషన్ గుంటూరు జిల్లా శాఖ హర్షం వ్యక్తం చేసింది. రెండు డీఏలకు సంబంధించి జీఓ 119, 120లు, ఈహెచ్ఎస్‌కు సంబంధించి జీఓ 131, అదనపు క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌కు సంబంధించి జీఓ 126 జారీ చేయడాన్ని స్వాగతిస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది. సెప్టెంబరు జీతాల నుంచి పెంచిన డీఏ అమలు చేసి అక్టోబరు 1న చెల్లించినట్లు జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు తెలిపారు.

ఈహెచ్ఎస్‌లో ఉద్యోగుల జీతాల నుంచి రికవరీ చేసే ప్రీమియం మొత్తాన్ని నేరుగా ట్రస్టుకు కేటాయించేలా జీఓ 131ను సెప్టెంబరు 28న జారీ చేశారని, అక్టోబరు 1 నుంచి అమల్లోకి వచ్చిందని తెలిపారు. పెన్షనర్ల అదనపు క్వాంటమ్ పెంపునకు జీఓ 126 జారీ కాగా, 2026 డిసెంబరు పెన్షన్ నుంచి పెంపు అమలు చేసి 2027 జనవరి 1న చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. స్వర్ణ గ్రామ, వార్డు ఉద్యోగులకు ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ అమలుకు జీఓ 7 జారీ చేయడాన్ని కూడా స్వాగతించారు. ఉద్యోగుల వేతన సవరణకు కీలకమైన 12వ పీఆర్సీకి సంబంధించి జీఓ 200 జారీ చేసి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దినేష్ కుమార్‌ను పీఆర్సీ చైర్మన్‌గా నియమించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జేఏసీ చైర్మన్ అలపర్తి విద్యాసాగర్, జనరల్ సెక్రటరీ ప్రసాద్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ డి.వి. రమణ నాయకత్వంలో ఉద్యోగ సంఘాలు నిరంతరం కృషి చేస్తున్నాయని ఘంటసాల శ్రీనివాసరావు తెలిపారు. హామీలను అమలు చేస్తున్న ప్రభుత్వానికి, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న జేఏసీ నాయకత్వానికి గుంటూరు జిల్లా ఏపీ ఎన్జీజీఓ అసోసియేషన్ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శ్యాంసుందర్ శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.కె. నాగూర్ షరీఫ్, గుంటూరు సిటీ అధ్యక్షుడు చింతల కళ్యాణ్ కుమార్, జిల్లా ట్రెజరర్ శ్రీధర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సుకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## 12వ పీఆర్సీ కమిషన్ నియామకంపై ఏపీ జేఏసీ అమరావతి హర్షం

- 12వ పీఆర్సీ కమిషన్ నియామకంపై హర్షం
- నివేదిక గడువును ఆరు నెలలకు కుదించాలి: ఆర్‌జేయూపీ

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమిస్తూ జీఓ 200 జారీ చేయడంపై రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ (ఆర్‌జేయూపీ) హర్షం వ్యక్తం చేసింది. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దినేష్ కుమార్‌ను కమిషనర్‌గా నియమించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి కృతజ్ఞతలు తెలిపినట్లు ఆర్‌జేయూపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం. షరీఫ్ తెలిపారు. 12వ పీఆర్సీని 2023 జులై 1 నుంచే అమలు చేయాల్సి ఉండగా ఇప్పటికే సుమారు 40 నెలలు ఆలస్యమైందని పేర్కొన్నారు. కమిషన్ నివేదిక సమర్పించేందుకు ప్రభుత్వం ఏడాది గడువు ఇవ్వడాన్ని పునఃపరిశీలించి ఆరు నెలలకు కుదించాలని షరీఫ్ కోరారు. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నందున ఆరు నెలల్లో నివేదిక సమర్పించడం సాధ్యమని, మరింత ఆలస్యం జరిగితే ఇప్పటికే పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, పెన్షనర్లకు ఆర్థిక నష్టం జరిగే అవకాశం ఉందని తెలిపారు. రాష్ట్ర విభజన సమయంలో 43 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చిన చంద్రబాబు నాయుడు ఈసారి కూడా మెరుగైన ఫిట్‌మెంట్ అందిస్తారని ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆశిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా ఫిట్‌మెంట్ ప్రకటిస్తుందన్న నమ్మకం ఉందన్నారు.

## ఇంటింటికీ ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు



**జంపని (జర్నలిస్ట్ ఫైల్) :** పేదల సంక్షేమమే లక్ష్యంగా అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు తెలిపారు. జంపని గ్రామంలో గురువారం నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

గ్రామంలోని బీసీ కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే, "పేదల సేవలో" కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను అందజేశారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితర లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల వద్దకే వెళ్లి సమస్యలను తెలుసుకోవడంతో పాటు అర్హులకు సంక్షేమ పథకాల ప్రయోజనాలను అందించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తోందని నక్కా ఆనంద బాబు పేర్కొన్నారు. పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితర వర్గాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. "పేదల ఇంటి వద్దకే సంక్షేమం.. ప్రజల వద్దకే ప్రజాప్రతినిధులు" అనే విధంగా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, వేమూరు నియోజకవర్గంలో ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కూటమి ప్రజాప్రతినిధులు, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, బూత్ ఇన్‌చార్జిలు, అనుబంధ విభాగాల నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## 12వ పీఆర్సీ కమిషనర్ నియామకంపై ఏపీ సచివాలయ సంఘం హర్షం

- వేతన సవరణకు మార్గం సుగమం
- ఆంధ్రప్రదేశ్ సచివాలయ సంఘం అధ్యక్షుడు జి. రామకృష్ణ



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సెప్టెంబరు 5న జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనం కలిగించే పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారని ఆంధ్రప్రదేశ్ సచివాలయ సంఘం అధ్యక్షుడు జి. రామకృష్ణ తెలిపారు. అందులో భాగంగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దినేష్ కుమార్‌ను 12వ పీఆర్సీ కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం జీఓ ఎంఎస్ నెం.200ను అక్టోబరు 1న జారీ చేసిందని పేర్కొన్నారు. ఈ నియామకంతో ఉద్యోగుల వేతన సవరణకు మార్గం సుగమమైందని తెలిపారు. ఇప్పటికే రెండు డీఏలను చెల్లించడం, పెన్షనర్లకు అదనపు క్వాంటమ్ పెన్షన్‌ను పునరుద్ధరించడం, ఉద్యోగుల నుంచి ప్రతి నెలా మినహాయిస్తున్న ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్) వాటాను ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్టుకు జమ చేయడం వంటి హామీలను ప్రభుత్వం అమలు చేసిందని జి. రామకృష్ణ తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సానుకూల నిర్ణయాలు తీసుకోవడంతో పాటు వాటిని వేగంగా కార్యరూపంలోకి తీసుకువస్తున్నారని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్‌కు సచివాలయ ఉద్యోగుల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు జి. రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.

## ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ లో 'రిఫార్మ్ ఉత్సవ్ గ్రామసభ స్థాయిలో' కార్యక్రమం

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని మేరా యువ భారత్, మేడికొండూరు సమీపంలోని ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్, పేస్ సొసైటీ ఆధ్వర్యంలో 'రిఫార్మ్ ఉత్సవ్--గ్రామసభ స్థాయిలో' కార్యక్రమాన్ని నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామసభల ప్రాధాన్యత, ప్రజల భాగస్వామ్యం, గ్రామీణాభివృద్ధిలో యువత పాత్రపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపాల్ డా. దోలా సంజయ్ మాట్లాడుతూ గ్రామసభలు ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదులని అన్నారు. గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలు, ముఖ్యంగా యువత చురుకుగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస, సేవా మార్గాలను స్ఫూర్తిగా తీసుకుని బాధ్యతాయుతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పేస్ సొసైటీ కార్యదర్శి పారుపల్లి రమేష్, ఎన్ఆర్ఐ డిప్లొమా కళాశాల ప్రిన్సిపాల్ పి. రవికుమార్, విభాగాధిపతులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎస్.కె. లాల్ జాన్ బాషా, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి. తిలక్ బాబు మార్గదర్శకత్వంలో కార్యక్రమం నిర్వహించారు. గ్రామాభివృద్ధి, సామాజిక బాధ్యతలో యువత భాగస్వామ్యం కావాలనే సందేశంతో కార్యక్రమం ముగిసింది.

## పాఠశాలలు నిర్వహణలో నిర్లక్ష్యం సహించం : ఎమ్మెల్యే గళ్లా మాధవి

- స్టాల్ గర్ల్స్ హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే గళ్లా మాధవి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** పిల్లలు చదివే పాఠశాలలు దేవాలయాల వంటివని, పరిశుభ్రమైన వాతావరణంలో చదివించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి పేర్కొన్నారు. గురువారం నగరంపాలెంలోని స్టాల్ గర్ల్స్ హైస్కూల్‌ను ఎమ్మెల్యే గళ్లా మాధవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినుల హాజరు, పాఠశాలలోని మౌలిక వసతులు, తరగతి గదుల పరిస్థితిని పరిశీలించారు. 6వ తరగతి విద్యార్థినులు తరగతి గది లేక బయట కూర్చొని చదువుకోవడం, పాఠశాల ఆవరణ అపరిశుభ్రంగా ఉండడం, కంప్యూటర్ ల్యాబ్ శిథిలావస్థలో ఉండడం గమనించిన ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పర్యటన సమాచారం అందుకుని ఎంఈఓ నాగేంద్రమ్మ పాఠశాలకు చేరుకోగా, పాఠశాల కరస్పాండెంట్, ఎంఈఓ మధ్య సరైన సమన్వయం లేకపోవడాన్ని కూడా ఆమె తప్పుబట్టారు.

అనంతరం ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ గతంలోనూ ఈ పాఠశాల, ఎస్సీ హాస్టల్‌లో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించి అనేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఒకప్పుడు వేలాది మంది బాలికలు చదువుకున్న స్టాల్ గర్ల్స్ హైస్కూల్ పశ్చిమ నియోజకవర్గంలోనే అత్యంత ప్రతిష్టాత్మక విద్యాసంస్థగా పేరుగాంచిందన్నారు. అయితే కాలక్రమేణా నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం విద్యార్థినుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

పాఠశాలకు వెళ్లే రహదారి సరిగా లేకపోవడం, గతంలో సూచించినప్పటికీ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోవడం, బాలికల హాస్టల్ పరిసరాలు అడవిని తలపించేలా ఉండడం ఆందోళన కలిగించే అంశాలని పేర్కొన్నారు.

పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని అధికారులకు సూచించారు.

పెద్ద పెద్ద తరగతి గదులు ఉన్నప్పటికీ వాటిని ఇతర అవసరాలకు వినియోగిస్తూ విద్యార్థినులను బయట కూర్చోబెట్టడం సరికాదని, వెంటనే వారికి ప్రత్యేక తరగతి గదులు కేటాయించాలని పాఠశాల యాజమాన్యాన్ని ఆదేశించినట్లు తెలిపారు. కంప్యూటర్ ల్యాబ్ నిర్వీర్యంగా మారడం, స్టోర్‌రూములు అధ్వాన్నంగా ఉండడం, కొన్ని తరగతి గదుల్లో సరిపడా ఫ్యాన్లు లేక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్న విషయాలను కూడా ప్రస్తావించారు.

ఈ పాఠశాల ఎయిడెడ్ సంస్థ కావడంతో ప్రభుత్వ నిధుల పరంగా కొన్ని పరిమితులు ఉన్నప్పటికీ, యాజమాన్యం పూర్తి బాధ్యతతో వ్యవహరించి సంస్థకు పూర్వ వైభవం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. అధికారులు కూడా ప్రత్యేక దృష్టి సారించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. ప్రస్తుతం ఎలక్ట్రికల్ పనులతో పాటు మరికొన్ని అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ఎమ్మెల్యే సూచించిన అంశాలను వారం రోజుల్లో సరిదిద్దుతామని పాఠశాల ప్రిన్సిపాల్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. వారం రోజుల తర్వాత మరోసారి పాఠశాలను సందర్శించి పరిస్థితిని సమీక్షిస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

అధికారులు, యాజమాన్యం, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేస్తే స్టాల్ గర్ల్స్ హైస్కూల్‌కు తప్పకుండా పూర్వవైభవం వస్తుంది" అని ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు.

Owned, Edited & Published by D.Ajay. Published from 126-352, 4Th Lane, Kodandarama Nagar, Gorlavaripalem Road, Gorantla, Guntur-522034 (A.P).
Printed by C.Sridhar Reddy at Teja Cards and Stationery, Shop no.1, 22-11-170, T.V Street, Lalapet,Guntur-522003(A.P.). Editor : D.Ajay. Phones: 7661805968, 9966319999. Email: dasariajjay@gmail.com